




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 326 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ గురువారం 31 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :326 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA THU 31 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# ఏపీలో జీసీసీ ఏర్పాటు చేయండి

## ఏబీమ్ కన్సల్టింగ్ సంస్థను కోరిన మంత్రి నారా లోకేశ్

- సింగపూర్ లో పర్యటిస్తున్న చంద్రబాబు, నారా లోకేశ్, ఇతర మంత్రులు
- ఏబీమ్ కన్సల్టింగ్ మేనేజింగ్ డైరెక్టర్ యానో టోమోకాజుతో మంత్రి లోకేశ్ భేటీ
- విశాఖను ప్రాంతీయ కేంద్రంగా ఎంపిక చేసుకోవాలని సూచన



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఏబీమ్ కన్సల్టింగ్ సంస్థను కోరారు. సింగపూర్‌లో ఏబీమ్ కన్సల్టింగ్ మేనేజింగ్ డైరెక్టర్ యానో టోమోకాజుతో మంత్రి లోకేశ్ బుధవారం నాడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విశాఖపట్నం ఐటీతో పాటు డేటా సిటీగా అభివృద్ధి చెందుతోందని, జీసీసీ సెంటర్ల ఏర్పాటుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఇటీవలే ఏఎన్ఎస్ఆర్ సంస్థ విశాఖలో జీసీసీ ఏర్పాటుకు ఎంఓయూ కుదుర్చుకుందని గుర్తుచేశారు. జీసీసీలకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ విశాఖలో ఉందని, ఏబీమ్ కన్సల్టింగ్ అక్కడ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి, వ్యయ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని ఏబీమ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సేవలకు విశాఖను ప్రాంతీయ కేంద్రంగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. మంత్రి లోకేశ్ ప్రతిపాదనలకు ఏబీమ్ కన్సల్టింగ్ మేనేజింగ్ డైరెక్టర్ యానో టోమోకాజు సానుకూలంగా స్పందించారు. తమ సంస్థ స్ట్రాటజీ, మేనేజ్‌మెంట్ ఐటీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, క్లౌడ్, సెక్యూరిటీ, అవుట్‌సోర్సింగ్ సేవలను అందిస్తుందని తెలిపారు. సింగపూర్, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా, వియత్నాంలో తమ సంస్థకు సుమారు 1,200 మంది నిపుణులైన కన్సల్టెంట్‌లు ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, శాప్ ఆధారిత సేవలను అందించడంపై దృష్టి సారిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని టోమోకాజు హామీ ఇచ్చారు.



## సింగపూర్ పర్యటన సూపర్ సక్సెస్

- సింగపూర్ పర్యటన ముగించుకుని ఏపీకి తిరుగు ప్రయాణమైన సీఎం చంద్రబాబు
- ఏపీ బ్రాండ్ ఇమేజ్ ను పెంచడమే లక్ష్యంగా సింగపూర్ పర్యటన
- అవిశ్రాంతంగా సమావేశాలు, సదస్సులకు హాజరు
- మొత్తం 26 కార్యక్రమాలకు హాజరైన చంద్రబాబు, లోకేశ్, ఇతర మంత్రులు, అధికారులు

పెన్ పవర్ డెస్క్: పెట్టుబడులను ఆకర్షించటం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చేపట్టిన సింగపూర్ పర్యటన విజయవంతంగా ముగిసింది. మంత్రులు నారా లోకేశ్, పి.నారాయణ, టీజీ భరత్ సహా ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి సింగపూర్ లో నాలుగు రోజుల పాటు అవిశ్రాంతంగా వివిధ సమావేశాలు, రౌండ్ టేబుల్ చర్చల్లో పాల్గొన్నారు. సింగపూర్ లోని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను సందర్శించి వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా అధ్యయనం చేశారు. పర్యటనలో మొత్తం 26 కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు, మంత్రులు హాజరయ్యారు. పర్యటన మొదటి నుంచి చివరి రోజు వరకూ క్షణం తీరిక లేకుండా ఆసాంతం రాష్ట్ర అభివృద్ధి కాంక్షతో నిరంతరం చర్చలు, సంప్రదింపులు జరిపారు. సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాన మంత్రి, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్, అలాగే వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి టాన్ సీ లెంగ్, సెక్యూరిటీ, హోం వ్యవహారాల మంత్రి కె.షణ్ముగం తదితరులతో సీఎం సమావేశమయ్యారు. ఏపీ-సింగపూర్ మధ్య సహకారాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్, అమరావతి

వివరాలు 2లో..

## భారత్‌పై 25 శాతం సుంకాలు విధించిన డొనాల్డ్ ట్రంప్

- ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించిన ట్రంప్
- అమెరికా వస్తువులపై భారత్ ఎక్కువ సుంకాలు విధిస్తోందన్న ట్రంప్
- మిత్ర దేశమైనప్పటికీ భారత్‌తో వ్యాపారం తక్కువేనని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై చర్యలు చేపట్టారు. భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ఆయన వెల్లడించారు.

వివరాలు 2లో..

### జగన్ పర్యటన ముగిశాక

## కాకాణి దుర్మార్గాలు బయటపెడతా

- నెల్లూరు వస్తున్న వైసీపీ అధినేత జగన్
- జైల్లో ఉన్న కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించనున్న వైనం
- జగన్ మాట విని ఎంతమంది జైలు పాలయ్యారన్న సోమిరెడ్డి
- వారిని కూడా జగన్ పరామర్శించాలని డిమాండ్




పెన్ పవర్ డెస్క్: వైసీపీ అధినేత జగన్ రేపు నెల్లూరు పర్యటనకు వస్తుండడంపై టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పందించారు. జగన్ ఏ ముఖం పెట్టుకుని నెల్లూరు వస్తున్నారని నిలదీశారు. జగన్ మాట విని ఎంతోమంది అధికారులు ఊచలు లెక్కపెట్టారని,

వివరాలు 2లో..

## విజయవంతంగా కక్ష్యలోకి 'నైసార్'

- నాసా, ఇస్రో సంయుక్తంగా రూపొందించిన ఉపగ్రహందం నైసార్
- నైసార్ ను మోసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్16
- ప్రయోగం విజయవంతమైందన్న ఇస్రో



పెన్ పవర్ డెస్క్:అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సంయుక్తంగా రూపొందించిన నైసార్ ఉపగ్రహాన్ని మోసుకుంటూ, భారత వాహన నౌక జీఎస్ఎల్వీ-ఎఫ్16 నింగిలోకి దూసుకెళ్లింది.

వివరాలు 2లో..

## చంద్రుడి వైపు దూసుకెళుతున్న గ్రహశకలం.. ఢీ కొడితే భూమిపైనా ప్రభావం!

- 15 అంతస్తుల భవనమంత పెద్దగా ఉందన్న నాసా
- ఈ గ్రహశకలం ఢీ కొంటే చంద్రుడిపై భారీ గుంత ఏర్పడుతుందంటున్న శాస్త్రవేత్తలు
- గ్రహశకలం మార్గాన్ని పరిశీలిస్తున్న నాసా జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్



పెన్ పవర్ డెస్క్:అంతరిక్షంలో ఓ గ్రహశకలం చంద్రుడి వైపు దూసుకెళుతోందని నాసా శాస్త్రవే త్తలు పేర్కొన్నారు. దాదాపు 15 అంతస్తుల భవన పరిమాణంలో ఈ గ్రహశకలం ఢీ కొడితే చంద్రుడి ఉపరితలంపై

వివరాలు 2లో..

## ఏపీలో గూగుల్ భారీ డేటా సెంటర్... !

- 6 బిలియన్ డాలర్ల పెట్టుబడితో విశాఖ కేంద్రంగా డేటా సెంటర్
- గూగుల్ భారతదేశంలో ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఇదే మొదటిసారి!
- అంతేకాదు... ఆసియాలోనే ఇదే ఫస్ట్ టైమ్!

పెన్ పవర్ డెస్క్:గూగుల్ సంస్థ ఏపీలో భారీ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. 6 బిలి యన్ డాలర్లు (దాదాపు రూ.50,000 కోట్లు) పెట్టుబడితో

వివరాలు 2లో..




## కాంగ్రెస్ హయాంలో ఢిల్లీ, వారణాసి, ముంబై.. ఇలా ఎన్నో చోట్ల బాంబు పేలుళ్లు జరిగాయి




- పేలుళ్లు జరగని నగరమే లేదని ఆగ్రహం
- ఉగ్రవాదాన్ని చూసీ చూడనట్లు వ్యవహరించారని ఆరోపణ
- మనపై బుల్లెట్లు పేల్చిన వారికి కాంగ్రెస్ బిర్యానీ పెట్టిందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనలో ఢిల్లీ, వారణాసి, ముంబై వంటి నగరాలలో బాంబు పేలుళ్లు సంభవించాయని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. రాజ్యసభలో జరుగుతున్న 'ఆపరేషన్ సిందూర్' పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూపీఏ హయాంలో బాంబు పేలుళ్లు జరగని నగరమే లేదని పేర్కొన్నారు. వారి పాలనలో

వివరాలు 2లో..

## నాతో డీల్ చేయండి.. ప్రధానమంత్రి వస్తే ఇబ్బంది అవుతుంది!

- ఆపరేషన్ సిందూర్‌పై రాజ్యసభలో చర్చ
- చర్చకు ప్రధానమంత్రి హాజరు కాకపోవడాన్ని ప్రశ్నించిన ఖర్గే
- సభ నుంచి వాకౌట్ చేసిన విపక్షాలు



పెన్ పవర్ డెస్క్: 'ఆపరేషన్ సిందూర్'పై రాజ్యసభ లో చర్చ సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనతో డీల్ చేయాలని, ప్రధానమంత్రి వస్తే ఇంకా ఇబ్బందిపడతారంటూ విపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనకపోవడాన్ని విపక్షాలు ప్రశ్నించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీ హాజరుకాకపోవడాన్ని ప్రశ్నించారు. అమిత్ షా ప్రసంగిస్తుండగా విపక్షాలు వాకౌట్ చేశాయి. అమిత్ షా మాట్లాడేందుకు

వివరాలు 2లో..

## మరిన్ని దేశాలకు సునామీ ముప్పు...

- రష్యాలో భారీ భూకంపం
- రిక్టర్ స్కేలుపై 8.8 తీవ్రత నమోదు
- పలు దేశాల్లో 3 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తుతో అలలు
- అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ తాజా అలర్ట్

వివరాలు 2లో..




## బీజేపీలో సినీ నటి ఖుష్బూకు మరో కీలక పదవి!

- తమిళనాడు రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమించిన బీజేపీ
- జేపీ నడ్డా ఆమోదంతో కొత్త కార్యవర్గాన్ని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన
- ఖుష్బూ సహా 14 మంది ఉపాధ్యక్షులుగా నియామకం



పెన్ పవర్ డెస్క్: ప్రముఖ సినీ నటి, బీజేపీ నాయకురాలు ఖుష్బూకు పార్టీలో కీలక పదవి లభించింది. ఆమెను తమిళనాడు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ బీజేపీ నిర్ణయం తీసుకుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదంతో కొత్త రాష్ట్ర కార్యవర్గాన్ని నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# సిగాచీ.. ఎంత మోసం.. ఎంత వంచన? పరిహారం ఎక్కడ?

సంగారెడ్డి జిల్లాలో జరిగిన సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో యాభై ఆరు మంది కార్మికులు చనిపోయారు. ఇందులో 46 మంది కార్మికులకు సంబంధించిన మృతదేహాలు, అవశేషాలు దొరకగా, మరో ఎనిమిది మందికి సంబంధించిన ఆనవాళ్లు కూడా లభించలేదు. సిగాచీ పరిశ్రమ యాజమాన్యంతో పాటు ప్రభుత్వం కూడా ఆ ఎనిమిది మంది చనిపోయి ఉంటారని ప్రకటించింది. అయితే సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా ఉత్తర్ ప్రదేశ్, బీహార్, ఒడిశాకు చెందిన కార్మికులు కూడా ఉన్నారు. ప్రమాదం జరిగిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాదస్థలాన్ని సందర్శించి మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియో చెల్లించాలని కోరారు.

**డెత్ సర్టిఫికెట్లు కూడా...**

అందుకు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం కూడా అంగీకరించి తాము కోటి రూపాయలు మృతి చెందిన వారి కుటుంబాలకు చెల్లిస్తామని, గాయపడిన వారికి ఉచితంగా తమ పరిశ్రమ తరుపున వైద్యసాయం అందిస్తామని చెప్పింది. అయితే ఇప్పటి వరకూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం కోటి రూపాయల పరిహారం చెల్లించలేదు. అయితే కొందరికి మాత్రం పదిహేను లక్షల రూపాయలు మాత్రం ఇచ్చి చేతులు దులుపుకుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆచూకీ లభించని ఎనిమిది మందికి సంబంధించిన వారికి డెత్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదు. ప్రమాదం జరిగి నెల రోజులవుతున్నా ఇంతవరకూ పరిహారం చెల్లించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అగ్రిమెంట్ పై సంతకం చేయించుకుంటూ...**

మృతి చెందిన కార్మిక కుటుంబాలను ఇటు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం పట్టించుకోవడం లేదని, అటు ప్రభుత్వం కూడా ప్రమాదం జరిగి ఇన్ని రోజులవుతుండటంతో దాని ఊసే మరిచిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిగాచీ పరిశ్రమ ప్రమాదంపై ఏర్పాటయిన నిపుణుల కమిటీ ఇప్పటి వరకూ ప్రభుత్వానికి నివేదిక అందచేయలేదు. ప్రమాదానికి గల కారణం పాత మిషనరీ అని కార్మికులు చెబుతున్నప్పటికీ ఇప్పటి వరకూ సిగాచీ పరిశ్రమ యాజమాన్యానికి సంబంధించి ఈ ఘటనలో ఎవరినీ అరెస్ట్ చేయకపోవడంపై విపక్షాలు సయితం ప్రశ్నిస్తున్నాయి. పైగా మృతి చెందిన కార్మికుల కుటుంబాలలో కొందరికి పదిహేను లక్షలు ఇచ్చి వారిచేత అగ్రిమెంట్లపై సంతకం కూడా సిగాచీ పరిశ్రమ యాజమాన్యం పెట్టించుకుందని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని కార్మికుల కుటుంబాలు కోరతున్నాయి.

**గాయపడిన వారికి...**

ప్రమాదంలో గాయపడిన వారు కోలుకుంటున్నారు. మూడు నెలల పాటు పరిశ్రమను మూసివేస్తున్నట్లు సిగాచీ పరిశ్రమ యాజమాన్యం ప్రకటించింది. అయితే గాయపడిన వారికి ఇంత వరకూ వారు కుటుంబాలు ఎలా జీవనం సాగిస్తారన్న దానిపై కూడా యాజమాన్యం క్లారిటీ ఇవ్వలేదు. ప్రమాదం జరిగినప్పుడు మాత్రం హడావిడి చేసి తామే అంతా చూసుకుంటామన్న సిగాచీ పరిశ్రమ యాజమాన్యం తర్వాత మాత్రం ఏమీ పట్టించుకోవడం లేదన్నవిమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. యాజమాన్యం తప్పుకు కార్మికుల కుటుంబాలు బలవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకుని కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# సమాచార శాఖ ఓపెన్ టాప్ వాహనానికి ఆగస్టు 18న బహిరంగ వేలం

విశాఖపట్నం, జూలై 29 :- సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖపట్నం కార్యాలయంలోని ఓపెన్ టాప్ వాహనానికి ఆగస్టు 18వ తేదీ ఉదయం 11.00 గంటలకు కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. కాలపరిమితి ముగిసి, నిరుపయోగంగా ఉన్న స్వరాజ్ మజ్దా ఓపెన్ టాప్ ఏపీ 31 టీయు 1495 (2008 మోడల్) వాహనాన్ని యధావిధిగా బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 5,000 ధరావతు సొమ్ము చెల్లించాలని, వేలం దక్కించుకున్న వారు జీఎస్టీతో పాటు మొత్తం నగదు వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. కార్యాలయ పని వేళల్లో వాహనాన్ని పరిశీలించుకోవచ్చున్నారు. వేలం వేయుటకు, రద్దు పరుచుటకు కార్యాలయ అధికారికి అధికారం ఉందని, వివరాలకు ఫోన్ 9642714155 నంబరును సంప్రదించవచ్చని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ సూచించారు.

**జారీ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, విశాఖపట్నం.**

# భారత్‌పై 25 శాతం సుంకాలు విధించిన డొనాల్డ్ ట్రంప్

- మొదటి పేజీ తరువాయి

అమెరికా వస్తువులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోందని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ సైనిక ఉత్పత్తులను, ముఖ్యంగా చమురును ఎక్కువగా దిగుమతి చేసుకుంటోందని ఆయన తెలిపారు. వాటిపై పెనాల్టీ విధించనున్నట్లు వెల్లడించారు. మిత్రదేశమైనప్పటికీ భారత్‌తో తమ వ్యాపారం తక్కువగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా విధించిన గడువు మేరకు భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఇంకా కుదరలేదని ఆయన తెలిపారు. ఈ కారణంగా సుంకాన్ని విధించినట్లు వెల్లడించారు. అయితే, ఆగస్టు 1 వరకు చర్చల్లో ఫలితం తేలకుంటే సుంకాన్ని విధిస్తానని ప్రకటించిన ట్రంప్, గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని మార్చుకొని సుంకాన్ని విధిస్తున్నట్లు

ప్రకటించడం గమనార్హం. భారత్ రష్యాతో స్నేహ సంబంధాలు కొనసాగించడం, కొన్ని రోజులుగా రష్యా నుంచి ముడి చమురు, ఆయుధాలను కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

# జగన్ పర్యటన ముగిశాక కాకాణి దుర్మార్గాలు బయటపెడతా

- మొదటి పేజీ తరువాయి

జగన్ వారిని పరామర్శించకుండా, కాకాణిని పరామర్శించేందుకు నెల్లూరుకు ఎందుకు వస్తున్నట్టు అని ప్రశ్నించారు. లిక్కర్ స్కాంలో జైలుకు వెళ్లిన మిథున్ రెడ్డి, రాజ్ కెసిరెడ్డి, ధనంజయరెడ్డిలను కూడా జగన్ పరామర్శించాలని అన్నారు. "కాకాణి అక్రమాలతో ఎంతోమంది అధికారులు సస్పెన్షన్ వేటుకు గురయ్యారు... అప్పట్లో వైసీపీ ఎంపీగా ఉన్న మాగుంట శ్రీనివాసుల రెడ్డి సంతకాన్ని కూడా

ఫోర్జరీ చేశారు... రేపు జగన్ పర్యటన ముగియగానే కాకాణి దుర్మార్గాలన్నీ బయటపెడతా" అని హెచ్చరించారు. కాకాణి పాపాలకు బలైన వారిని కూడా జగన్ పరామర్శించాలని సోమిరెడ్డి స్పష్టం చేశారు.

# ఏపీలో గూగుల్ భారీ డేటా సెంటర్... !

- మొదటి పేజీ తరువాయి

విశాఖ కేంద్రంగా 1 గిగా బైట్ సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ ను ఏర్పాటు చేయబోతున్నారు. గూగుల్ భారతదేశంలో ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఇదే మొదటిసారి. అంతేకాదు, ఆసియాలోనే ఇంత పెద్ద డేటా సెంటర్‌ను ఇంత ఎక్కువ ఖర్చుతో నిర్మించడం ఇదే తొలిసారి. ఈ డేటా సెంటర్‌కు విద్యుచ్ఛక్తి అవసరం కాబట్టి, దానికి సౌరశక్తి (సూర్యరశ్మి నుండి వచ్చే కరెంట్) మరియు పవనశక్తి (గాలి నుండి వచ్చే కరెంట్) కోసం 2 బిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నారు. అంటే, పర్యావరణానికి హాని లేకుండా కరెంట్ తయారు చేసుకుంటారు.

భారతదేశంలో డిజిటల్ సేవలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి గూగుల్ ఈ పెట్టుబడి పెడుతోంది. విశాఖపట్నాన్ని ఎంచుకోవడం వెనుక ఆ ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలు, అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్న మద్దతు కూడా కారణం. ఈ పెట్టుబడితో భారతదేశం, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, టెక్నాలజీ రంగంలో మరింత ముందుకు వెళుతుందని చెప్పవచ్చు. ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సింగపూర్ పర్యటనలో టెక్ దిగ్గజాలతో వరుస భేటీలు నిర్వహించడం తెలిసిందే.

సింగపూర్ లో నిన్న జరిగిన బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో నారా లోకేశ్... గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ డ్రూ బైన్స్ తో సమావేశమయ్యారు. విశాఖలో డేటా సిటీ స్థాపనకు ఏం కావాలా అన్నీ అందుబాటులోకి తెచ్చామని, వీలైనంత త్వరగా గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని లోకేశ్ కోరారు. ఏపీ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బైన్స్ హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే, గూగుల్ భారీ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది.

# చంద్రుడి వైపు దూసుకెళుతున్న గ్రహశకలం.. ఢీ కొడితే భూమిపైనా ప్రభావం!

- మొదటి పేజీ తరువాయి

800 అడుగుల మేర భారీ గుంత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావం భూమిపైనా పడుతుందని అంచనా వేశారు. నాసా జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ గుర్తించిన ఈ గ్రహశకలాన్ని 2024 వైఆర్4 గా వ్యవహరిస్తున్నారు. ఇది 2032 చంద్రుడిని తాకనుందని చెబుతున్నారు. అయితే, ఈ గ్రహశకలం చంద్రుడిని ఢీ కొట్టే అవకాశం స్వల్పంగానే ఉందని వివరించారు.

**చంద్రుడిని ఢీ కొడితే ఏంజరగనుంది..**

2024 వైఆర్4 గ్రహశకలం చంద్రుడిని ఢీ కొడితే భారీ విస్ఫోటనం ఏర్పడుతుందని, గ్రహశకలం ముక్కలైపోతుందని నాసా శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ గ్రహశకలం ముక్కలు భూమివైపు వస్తాయని, వాటివల్ల భూ కక్ష్యలో తిరగుతున్న ఉపగ్రహాలకు ముప్పు పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కటీ ఒక్కో మీటర్ పరిమాణంలో ఉండే ఈ గ్రహశకలం ముక్కలు కనుక

ఢీ కొడితే ఉపగ్రహాలు దెబ్బతింటాయని తెలిపారు. ప్రస్తుతం భూమి చుట్టూ సుమారు 10 వేలకు పైగా యాక్టివ్ ఉపగ్రహాలు తిరుగుతున్నాయని, మరో 25 వేల వరకు అంతరిక్ష వ్యర్థాలు ఉన్నాయని నాసా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అయితే, 2024 వైఆర్4 గ్రహశకలం చంద్రుడిని ఢీ కొట్టే అవకాశం స్వల్పంగానే ఉండడంతో ముప్పు ఉండకపోవచ్చని వివరించారు.

# సింగపూర్ పర్యటన సూపర్ సక్సెస్

- మొదటి పేజీ తరువాయి

అభివృద్ధిలోనూ భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకునేందుకు వచ్చినట్టు అక్కడి ప్రభుత్వ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించి చెప్పారు. నవంబరు 14-15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు హాజరుకావాల్సిందిగా సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధుల్ని సీఎం ఆహ్వానించారు. సింగపూర్ లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే పర్యటన ఆసాంతం ముఖ్యమంత్రి బృందానికి సహాయ సహకారాలు అందించారు.

**నిర్విరామంగా సమావేశాలు-సందర్శనలు**

మరోవైపు సుర్బానా జురాంగ్, సెంబ్ కార్ప్, ఎస్ఐఏ ఇంజనీరింగ్, ఏఐ సింగపూర్, కెప్పెల్ కార్పోరేషన్, జీఐసీ, ఎస్ఎంబీసీ, కాపిటాల్యాండ్ ఇన్వెస్ట్మెంట్, ఎవర్సెండై ఇంజనీరింగ్, టామ్ సెక్, విల్మర్, టీవీఎస్ మోటార్స్, మండై వైల్డ్ లైఫ్, అదానీ పోర్ట్స్ తదితర కంపెనీల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలోని అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు. పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల పాలసీల గురించి సీఎం అవగాహన కల్పించారు. భారతదేశంలో పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోకి వచ్చే కంపెనీలకు పెద్దఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు సీఎం చెప్పారు. పట్టణాభివృద్ధి, ఐటీ, ఏఐ, ఫినటెక్, మారిటైమ్, పోర్ట్స్ మౌలిక సదుపాయాలపై నిర్వహించిన వేర్వేరు రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి ఇక్కడి వనరుల్ని వినియోగించుకుని పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ పారిశ్రామిక వేత్తలను కోరారు. దీంతో పాటు సింగపూర్ లోని ప్రతిష్టాత్మక హౌసింగ్ ప్రాజెక్టు బిడదారి ఎస్టేట్, జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్, టువాస్ పోర్టు, సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ ను సీఎం బృందం సందర్శించింది. ఆయా ప్రాజెక్టుల్లో అమలు చేస్తోన్న అత్యుత్తమ, ఆధునిక విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించింది.

**ఆకట్టుకున్న తెలుగు డయాస్పోరా**

మొత్తం పర్యటనలో సింగపూర్ లో నిర్వహించిన 'తెలుగు డయాస్పోరా ఫ్రమ్ సౌత్ ఈస్ట్ ఏషియా' సమావేశం విశేషంగా నిలిచింది. పర్యటన ఆరంభంలో సింగపూర్ తో పాటు సమీపంలోని ఐదు దేశాల నుంచి వచ్చిన తెలుగువారు ఆత్మీయ, అభిమానాలతో ముఖ్యమంత్రి బృందానికి ఘనస్వాగతం పలికారు. పర్యటన చివరి రోజైన బుధవారం కూడా సీఎం చంద్రబాబు, మంత్రులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్రానికి తిరుగు ప్రయాణం అయ్యారు. సింగపూర్ నుంచి బయల్దేరిన సీఎం రాత్రి 10.30 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వెంటనే బయల్దేరి రాత్రికే విజయవాడ చేరుకోనున్నారు.

# బీజేపీలో సినీ నటి ఖుష్బూకు మరో కీలక పదవి!

- మొదటి పేజీ తరువాయి

తమిళనాడు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఖుష్బూ సుందర్ సహా 14 మంది నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఐదుగురు, రాష్ట్ర కార్యదర్శులుగా మరో 14 మందితో కూడిన జాబితాను నాగేంద్రన్ తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. ఖుష్బూ ప్రస్తుతం జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలుగా కొనసాగుతున్నారు. అంతేకాకుండా, ఆమె పార్టీ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా కూడా కొనసాగుతున్నారు.

# నాతో డీల్ చేయండి.. ప్రధానమంత్రి వస్తే ఇబ్బంది అవుతుంది!

- మొదటి పేజీ తరువాయి

నిలబడగానే విపక్షాలు ఆందోళనకు దిగాయి. సభలో ప్రధానమంత్రి మాట్లాడాలని డిమాండ్ చేశాయి. పీఎం.. పీఎం అంటూ నినాదాలు చేశాయి. అమిత్ షా స్పందిస్తూ, నరేంద్ర మోదీ కార్యాలయంలోనే ఉన్నారని, ఈ వ్యవహారంపై అన్ని విషయాలను తనతో చెప్పారని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రధాని సభకు రాకపోతే సభను అవమానించడమేనని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు ప్రాంగణంలోనే ఉండి సభకు రాకపోవడం సరికాదని ఆయన అన్నారు. అమిత్ షా స్పందిస్తూ, ప్రధానమంత్రి గురించి అడిగే వారి బాధను తాను అర్థం చేసుకోగలనని, కానీ ఆయన కార్యాలయంలోనే ఉన్నారని పేర్కొన్నారు. అన్ని విషయాలపై తాను మాట్లాడి, పూర్తి స్పష్టత ఇస్తున్నప్పుడు ప్రధానమంత్రి నుంచి వినాలని అనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రధానమంత్రి వస్తే మీకు ఇంకా ఇబ్బంది అవుతుందని సున్నితంగా హెచ్చరించారు.

# కాంగ్రెస్ హయాంలో ఢిల్లీ, వారణాసి, ముంబై.. ఇలా ఎన్నో చోట్ల బాంబు పేలుళ్లు జరిగాయి

- మొదటి పేజీ తరువాయి

ఉగ్రవాదాన్ని చూసీచూడనట్లు వ్యవహరించారని ఆరోపించారు. పహల్గామ్ దాడి, తదనంతర ఆపరేషన్ సిందూర్‌పై ప్రశ్నిస్తున్నవారు గతంలోని తమ పాలనను గుర్తుకు తెచ్చుకోవాలని కాంగ్రెస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అప్పట్లో పేలుళ్లు జరగని నగరమంటూ ఏదీ లేదని అన్నారు. వందలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మనపై బుల్లెట్లు పేల్చిన వారికి కాంగ్రెస్ బిర్యానీ పెట్టిందని వ్యంగ్యంగా అన్నారు. ఉగ్ర దాడులు చేసిన వారితో వాణిజ్య సంబంధాలు పెంచుకున్నారని ఆరోపించారు. పాకిస్థాన్‌తో సింధూ నదీ జలాల ఒప్పందం అమలు నిలిపివేతను కాంగ్రెస్ అర్థం చేసుకోలేకపోయిందని విమర్శించారు. దేశ భద్రత విషయంలో మోదీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# విజయవంతంగా కక్ష్యలోకి 'నైసార్'

- మొదటి పేజీ తరువాయి

అత్యంత శక్తిమంతమైన అబ్జర్వేషన్ శాటిలైట్ నైసార్ ను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. ఈ ఉపగ్రహం బరువు 2,393 కిలోలు. నైసార్ అంటే నాసా ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్. ఇందులో ఉండే రెండు భారీ డిష్ ల వంటి నిర్మాణాలు భూమిపైకి మైక్రోవేవ్, రేడియో వేవ్ సంకేతాలు పంపుతాయి. ఆ సంకేతాలు భూమిని తాకి పరావర్తనం చెంది తిరిగి శాటిలైట్ ను చేరతాయి. నైసార్ లోని సాంకేతిక వ్యవస్థలు ఆ సంకేతాలను విశ్లేషించి చిత్రాలుగా రూపొందిస్తాయి.

ప్రకృతి విపత్తులను ఇది ముందుగానే అత్యంత కచ్చితత్వంతో అంచనా వేస్తుందని భావిస్తున్నారు. ఇస్రో అత్యంత చవకగా రాకెట్ ప్రయోగాలు చేపట్టడం గమనించిన నాసా... ఈ ఉపగ్రహ ప్రయోగం కోసం ఇస్రోతో జట్టుకట్టింది.

# మరిన్ని దేశాలకు సునామీ ముప్పు...

**పెన్ పవర్ డెస్క్:** రష్యాలో భారీ భూకంపం సంభవించడంతో ప్రపంచ దేశాల్లోనూ కలకలం రేగింది. 8.8 తీవ్రతతో ప్రకంపనలు రావడంతో పలు దేశాలను సునామీ తాకింది. తాజాగా, అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ మరికొన్ని దేశాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. రష్యా, హవాయి దీవులు, ఈక్వెడార్ 3 మీటర్ల కంటే ఎత్తయిన అలలతో సునామీ వచ్చే అవకాశం ఉంది. జపాన్, చిలీ, కోస్టారికా, పెరు, సోలోమన్ ఐలాండ్స్, కిరిబాటి, సమోవా, ఫ్రెంచ్ పాలినేషియా దీవులు, గ్వామ్, పాల్మిరా ఐలాండ్, మిడ్ వే ఐలాండ్, జాన్ స్టన్ అటోల్, జార్విస్ దీవులకు 1 మీటర్ నుంచి 3 మీటర్ల అలలతో సునామీ వచ్చే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, ఫిజీ, ఎల్ సాల్వడార్, గ్వాటెమాలా, పపువా న్యూగినీ, తైవాన్, ఫిలిప్పీన్స్, నికరాగువా, మెక్సికో, కొలంబియా, పనామా, కుక్ ఐలాండ్స్, అంటార్కిటికా ప్రాంతాలకు 0.3 మీటర్ల నుంచి 1 మీటరు ఎత్తు అలలో సునామీ వచ్చే అవకాశం ఉంది.

చైనా, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, వియత్నాం, బ్రూనై, మలేషియా దేశాలకు 0.3 మీటర్ల కంటే తక్కువ ఎత్తుతో అలలు వచ్చే అవకాశం ఉందని అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ వెల్లడించింది.

# ఈనాం భూములను పరిశీలించిన ఇన్చార్జ్ కలెక్టర్



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,జులై 30:** పెంటపాడు మండలం ఉమామహేశ్వరం గ్రామం ఇనామ్ రికార్డులను ఇంచార్జ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం పరిశీలించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తహసిల్దార్ కార్యాలయం లోని రికార్డు రూమ్ ను పరిశీలించారు. పెంటపాడు మండలం ఉమామహేశ్వరం గ్రామానికి సంబంధించిన ఇనామ్ రికార్డులను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. మండలంలో రెవిన్యూ గ్రామమైన దర్శిపర్రు శ్రీదేవి పుంతకు చెందిన భూ స్వభావ మార్పునకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పెంటపాడు మండలంలోని ముదునూరుపాడు గ్రామంలో నెంబర్.14 ప్రభుత్వ చౌక దుకాణాన్ని తనిఖీ చేశారు. స్టాకును పరిశీలించారు .ప్రతి నెల పేదవారికి అందవలసిన నిత్యావసర సరుకులు సకాలంలో అందజేయాలని రేషన్ షాపు డీలర్ ను ఆదేశించారు. వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి నిత్యవసర సరుకులు అందజేయాలని సూచించా రు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో, తాహసిల్దార్ రాజరాజేశ్వరి, మండల సర్వేయర్ దీప్తి లాస్య, వీఆర్వోలు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూ॥ గోదావరి । ప॥ గోదావరి । ఏలూరు

## జిల్లాలో 3,801 మందికి
# స్పౌస్ పెన్షన్లు మంజూరు : కలెక్టర్ పి. ప్రశాంతి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ రాజమహేంద్రవరం, జులై 30 :** తూర్పు గోదావరి జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. జిల్లాలో కొత్తగా 3,801 మందికి జీవిత భాగస్వామి (స్పౌస్) పెన్షన్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి బుధవారం వెల్లడించారు. ఈ పెన్షన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1.52 కోట్లు విడుదల చేసినట్లు ఆమె తెలిపారు. కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు వచ్చే నెల 1వ తేదీ నుంచి వారి నివాసాల్లోనే పెన్షన్లు అందజేసేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మొత్తం 2,36,331 లబ్ధిదారులకు రూ.1032.62 కోట్లు పెన్షన్ల రూపంలో విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు మునిసిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), ఇతర సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు.

పెన్షన్ల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా, సమయానికి పూర్తయ్యేలా మునిసిపల్, పంచాయతీ, గ్రామ/వార్డు సచివాలయ స్థాయి ఉద్యోగులు సమ న్వయంతో పనిచేయనున్నారని కలెక్టర్ వివరించారు. ఈ కార్య క్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అంద జేయనున్నారని, అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేయాలంటూ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విధంగా ప్రభుత్వం నిరుపేదలకు ఆర్థిక భద్రత కల్పించే దిశగా మరొక అంకాన్ని ప్రారంభించినట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాలో మంజూరైన స్పౌస్ పెన్షన్లు అనేక నిరుపేద కుటుంబాలకు మేలు చేసేలా ఉండబోతున్నాయని, ఈ నిర్ణయం ద్వారా జీవిత భాగస్వామిని కోల్పోయిన వారికి భద్రత లభించనుందని కలెక్టర్ పి. ప్రశాంతి అభిప్రాయపడ్డారు.

## మత్తు పదార్థాల విక్రయాలపై ప్రజలు
# పోలీసులకు సమాచారం ఇవ్వాలి



### ఎస్పీ నరసింహా కిషోర్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జులై 30:** ది రాజమండ్రి కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్, ఈగల్ టీం ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరం నగరంలో యాంటీబయోటిక్స్, నార్కోటిక్స్ డ్రగ్స్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు భారీ ర్యాలీ, సదస్సు నిర్వహించబడింది. జాంపేట గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీకి తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహా కిషోర్ పచ్చ జెండా ఊపి ప్రారంభ సూచన ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతోందన్నారు. ప్రజలు, ముఖ్యంగా యువత, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయోటిక్స్ వాడడం వలన ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, అందువల్ల అన్ని వర్గాలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఇప్పటికే రెండు డ్రగ్ డి-అడిక్షన్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, డ్రగ్స్‌కు అలవాటు పడిన వారికి ఈ కేంద్రాల్లో కౌన్సిలింగ్ అందిస్తున్నామని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయంపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని, అలాంటి వారిపై పీడీ యాక్టు ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకు మాత్రమే మందుల విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని, నిర్బంధిత నిబంధనలు పాటించని మెడికల్ షాపులపై చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్), డీఎస్పీ (సెంట్రల్ జోన్), ఇన్స్పెక్టర్లు, డ్రగ్స్ కంట్రోల్ శాఖ అధికారులు, నగరంలోని మెడికల్ షాపుల యాజమానులు, ది రాజమండ్రి హోల్‌సేల్ డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్, తూర్పుగోదావరి జిల్లా డ్రగ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. డ్రగ్ వినియోగంపై అవగాహన కల్పించే ప్లకార్డులు ప్రదర్శించారు.

## అర్హులైన రైతులు వెంటనే బ్యాంకు ఖాతాలకు
# ఎన్పీసీఎల్ లింక్ చేయించుకోండి: జేసీ రాహుల్ మీనా సూచన



**కాకినాడ, పెన్ పవర్ జులై 30 :** జిల్లాలోని అన్నదాతలందరికీ ఆర్థిక సహాయం విస్తృతంగా అందేందుకు అవసరమైన ప్రతి చర్యను అధికారులు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ, లీడ్ బ్యాంక్, పోస్ట్ ఆఫీస్ అధికారులతో కలిసి ఆయన అన్నదాత సుఖీభవ పథకం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 2న పీఎం కిసాన్ నిధులతో పాటు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.7 వేల నగదు మద్దతును రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నదని తెలిపారు. అయితే, ఎన్పీసీఎల్ లింక్ లేకపోతే లేదా బ్యాంక్ ఖాతా ఇన్ యాక్టివ్ గా ఉన్నటో రైతులకు ఈ సహాయం అందదని, అందుకే రైతులు తమ ఖాతాలకు వెంటనే ఎన్పిసిఐ లింక్ చేయించుకోవాలి, ఈ-కేవైసీ పూర్తిచేయించుకోవాలని సూచించారు.ఇప్పటికే అర్హులైన రైతులకు ఈ అంశంపై పూర్తి అవగాహన కల్పించాలంటూ సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. రైతులకు ఏ విధంగానైనా నష్టమవకుండా ముందస్తుగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో డీఆర్వో వెంకటరావు, వ్యవసాయ శాఖ జేడీ ఎన్. విజయ్ కుమార్, ఎల్డీఎం సీహెచ్.ఎస్.వి. ప్రసాద్, పోస్ట్ ఆఫీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికను గర్భవతిని చేసిన స్కూల్ సెక్రటరీ అరెస్ట్



**మండపేట, పెన్ పవర్ జులై 30 :** అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరంలో ఓ మైనర్ బాలికను లైంగికంగా వేధించి గర్భవతిని చేసిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. మార్గదర్శి ఫౌండేషన్ స్కూల్‌కి చెందిన సెక్రటరీ జయరాజు అనే వ్యక్తి ఈ నేరానికి పాల్పడ్డట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనపై స్పందించిన ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి మాట్లాడుతూ, నిందితుడిపై ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. బాధిత బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన మానసిక ఆరోగ్య సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు.

**తల్లిదండ్రులకు సూచనలు:** "తల్లిదండ్రులు తమ పిల్లల మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలి. చిన్న చిన్న మార్పులనైనా నిర్లక్ష్యం చేయకూడదు," అని ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి స్పష్టం చేశారు.

**అవగాహన కార్యక్రమాలు:** ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యాసంస్థల్లో 'శక్తి టీమ్'ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె వెల్లడించారు. అలాగే, ఇలాంటి దారుణ సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వాడపల్లి ప్రసాదాల తయారీ కేంద్రాలను
## పరిశీలించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు





**ఆత్రేయపురం, పెన్ పవర్ జులై 30:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వాడపల్లి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం జరిగిన ఒక విశేష ఘటన అక్కడ భక్తుల ఆకర్షణగా నిలిచింది. ఆలయంలో జరుగుతున్న అన్నదానం, లడ్డు, పులిహోర ప్రసాదాల తయారీ ప్రక్రియను స్వయంగా పరిశీలించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు సందర్శించారు. ఉభయగోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీవిబి నందాజీ, జిల్లా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వై. రామయ్య ఆలయ ప్రాంగణానికి చేరుకుని, అక్కడి ప్రసాద తయారీ కేంద్రాలను నిఖార్సైనంగా పరిశీలించారు. ఆలయంలో భక్తుల కోసం ఉచితంగా అందిస్తున్న అన్న ప్రసాద కేంద్రం, పులిహోర, లడ్డు తయారీ విభాగాలు, అలాగే ఆర్వో వాటర్ ప్లాంట్ వంటి కీలక ప్రాంతాల్లో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను వారు సమీక్షించారు. అనంతరం, ఆలయంలో ఉన్న వసతులు, తయారీ ప్రక్రియ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. "ఇక్కడి నిర్వహణ చాలా ఉత్తమంగా ఉంది. ప్రసాదాల తయారీలో హైజీనిక్ ప్రమాణాలు పాటించడం అభినందనీయం," అని వారు పేర్కొన్నారు.ఫుడ్ సేఫ్టీ అధికారులు స్వామివారిని దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, దర్శనం అనంతరం వేద పండితుల చేత వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, "వాడపల్లి ఆలయం కోనసీమ గర్వకారణం. ఇక్కడ ప్రసాదాల నాణ్యత పట్ల అధికారులు స్వయంగా వచ్చి పరిశీలించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నాంఅన్నారు.

# ప్రజలకిచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటాం

## భవిష్యత్తులో ఇంకా మెరుగైన సుపరిపాలన అందిస్తాం
## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్ జులై 30 :** ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్కహామీ తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరింతగా మెరుగైన సుపరిపాలన అందించే దిశగా కూటమి ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం రామచంద్రపురం రూరల్ లోని తాళ్లపొలం,ఉట్రుమిల్లి గ్రామాల్లో ప్రజల వద్దకు నేరుగా వెళ్ళి కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం వివరించారు. ప్రజల యొక్క అభిప్రాయాలు తెలుసుకొని మై టీడీపీ యాప్ లో వివరాలు పొందుపరిచారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలు చేస్తూ, ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందన్నారు.తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, వృద్ధులు, వితంతువులకు 4 వేలు, దివ్యాంగులకు 6 వేలు, పూర్తి వైకల్యం ఉన్నవారికి 15 వేలు, దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించా మన్నారు. ఆగస్టులో అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రవేశం హామీలునెరవేర్చుతున్నామన్నారు. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండేలా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోకుండా, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. మంత్రి సుభాష్ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికి, హారతులు పట్టారు. కూటమి ప్రభుత్వ పాలన బాగుంది అంటూ కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, రామచంద్రపురం ఏఎంసీ ఛైర్మన్ అక్కుల రిశ్వంత్ రాయ్ , ఆర్యవటం సొసైటీ ఛైర్మన్ కోట తాతబ్బాయి , మమండల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు, బూత్, క్లస్టర్ ఇన్చార్జిలు, డీసీలు, అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జగ్గంపేటలో సచివాలయం 3 ప్రారంభం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 30:**
స్థానిక పద్మనాభ నగర్ లో రూ.48.6 లక్షలతో నిర్మాణం చేసిన సచివాలయం 3 కార్యాలయాన్ని బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ముందుగా నూతన సచివాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే నెహ్రూకు నాయకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేటలో సచివాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉద్యోగులను సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం పలు గదులను ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, సత్తి సదాశివరెడ్డి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, వేములకొండ జోగారావు తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బుర్రి సత్తిబాబు, సర్పంచ్ బచ్చల నాగరత్నం, కాంట్రాక్టర్ పాఠంశెట్టి లక్ష్మణ్ మూర్తి, పంచాయతీరాజ్ డిఇ ఉమా శంకర్, జేఈ నారాయణమూర్తి, ఎండిఓ చంద్రశేఖర్, ఈవోపీఆర్డి భాస్కర్ రావు, పంచాయతీ సెక్రటరీ శివ, సిడిపిఓ పూర్ణిమ, నండ్ల చిరంజీవి, రాయి సాయి, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### అలంకారప్రాయమైన
## అంగన్వాడి వాటర్ ట్యాంకులు



**వై రామవరం, పెన్ పవర్,జూలై 30 :**
చిన్నారుల దాహార్తిని తీర్చడం కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు అలంకారప్రాయంగా మిగిలాయని పలువురు అంటున్నారు. మండలంలో ఉన్న ప్రతి అంగన్వాడీ కేంద్రానికి ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా వాటర్ ట్యాంకులను మంజూరు చేయడం జరిగింది అన్నారు. చిన్నారుల దాహార్తిని తీర్చడం కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు, పైపులైన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలాయని పలువురు అంటున్నారు. ఈ విషయమే ఆయా సెంటర్లో అంగన్వాడీ కార్యకర్తలను ప్రశ్నిస్తే ఎవరో వచ్చి బిగించి వెళ్లిపోయారని, పైపులైన్ కనెక్షన్ ఇవ్వలేదని, ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రాలలో ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంకులకు కనెక్షన్లు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

### అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన
## పాటంశెట్టి సూర్యచంద్ర



**గోకవరం, పెన్ పవర్, జూలై 30 :**
స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గత సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ నందు జాయింట్ కలెక్టర్ చినరాముడు వద్దకు నూరు శాతం అంధత్వంతో కంటిచూపు కోల్పోయి పింఛన్ రాక అనేక అవస్థలు పడుతున్న గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన ఇంజరపు రాంబాబు అదేవిధంగా మంచానికే పరిమితమైన అచ్యుతాపురం గ్రామస్తులైన దివ్యాంగులు కోలా శివాజీ, బందారు వెంకటరమణలకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని సామాజికవేత్త పాటంశెట్టి సూర్యచంద్ర జాయింట్ కలెక్టర్ చినరాముడును కోరగా స్వయంగా వారి పరిస్థితులు చూసి చలించిన జాయింట్ కలెక్టర్ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న అధికారులకు పాటంశెట్టి సూర్యచంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

## హోల్ సేల్ ధరలకే రిటైల్ అమ్మకాలు



**వై రామవరం,పెన్ పవర్, జూలై 30:**
మండలంలో చవిటి దిబ్బల గ్రామములో ఉన్న సుధా ఆగ్రో ఏజెన్సీస్ మరియు జనరల్ షాపులో హోల్ సేల్ ధరలకే రిటైల్ గా విక్రయిస్తున్నట్లు ప్రొప్రైటర్ నాత్రా రవీంద్ర వర్మ తెలిపారు. ఏజెన్సీలోని మండలంలో హోల్ సేల్ ధరలకే రిటైల్ అమ్మకాలు సాగిస్తున్నామని తెలిపారు. మార్కెట్ రేట్లకు అనుగుణంగా సరుకులు ధరలలో వ్యత్యాసాలను బట్టి రిటైల్ గా అమ్మకాలు సాగిస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అర్ధాంతరంగా నిలిచిపోయిన హౌసింగ్ కాలనీల నిర్మాణాలు



### లక్ష రూపాయల కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లు

**వై రామవరం, పెన్ పవర్, జూలై 30 :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు లక్ష రూపాయల కోసం ఎదురుచూస్తూ హౌసింగ్ కాలనీల నిర్మాణాలను అర్ధాంతరంగా కాంట్రాక్టర్లు నిలిపివేశారని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోనికి వెళ్తే పిఎం జన్ మన్ పథకంలో ఒక్కొక్క హౌసింగ్ కాలనీకి 2,39,000 రూపాయలు కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరయ్యాయని లబ్ధిదారులు తెలిపారు. పనులు త్వరితగతిన అవుతాయని ఉద్దేశంతో ప్రతి లబ్ధిదారుని మొదటి దఫాగా ఖాతాలో 70 వేల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. మండలంలో పలువురు కాంట్రాక్టర్లు అడ్వాన్సులు తీసుకొని చకచకా పనులు మొదలెటేసారని తెలిపారు. బేస్మెంట్ అనంతరం లింటల్ లెవెల్ వరకు 90 వేల రూపాయలు చెల్లించడం జరిగిందన్నారు. స్లాబ్ వేసి, ప్లాస్టింగ్ చేసి గచ్చులు చేస్తే 40 వేల రూపాయలు లబ్ధిదారుని ఖాతాలో జమ అయ్యే యని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు అదనంగా లబ్ధిదారులకు చెల్లిస్తుందని ప్రకటించడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా ఒప్పందం కుదుర్చుకున్న ప్రకారం హౌసింగ్ కాలనీల నిర్మాణాలను కాంట్రాక్టర్లు చేయడం లేదని, హౌసింగ్ అధికారులు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



### ఏజెన్సీలో బంగారు వరలక్ష్మి
# కానుక-3కు విశేష స్పందన

- లక్కీ డ్రాలో గెలుపొందిన 80 మహిళలకు ఉచితంగా బంగారు రూపుల పంపిణీ
- మహిళలో హైందవ చైతన్యం పెంపొందించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం
- పేరు నమోదు చేసిన ప్రతి మహిళకు బంగారు రూపు వచ్చే వరకు కార్యక్రమం కొనసాగింపు
- గెలుపొందని మహిళలకు పసుపు,కుంకుమ,జాకెట్ ముక్కల పంపిణీ



**దేవీపట్నం, పెన్ పవర్, జూలై30:**
దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక-3 కార్యక్రమానికి మహిళల నుంచి విశేష స్పందన లభించింది.చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.తొలుత విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు,బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు,శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులు జ్యోతిప్రజ్వలన చేసి లక్కీ డ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం లక్కీ డ్రాలో గెలుపొందిన 80 మంది మహిళలకు ఉచితంగా బంగారు వరలక్ష్మి రూపులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, హిందూ ధర్మ పరిరక్షణ లక్ష్యంగా, మహిళల్లో హైందవ చైతన్యం పెంపొందించే దిశగా 2023లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ప్రతి సంవత్సరం వరుసగా నిర్వహిస్తూ,పేర్లు నమోదు చేసుకున్న ప్రతి మహిళకు బంగారు రూపు వచ్చే వరకు ఈ కానుక కార్యక్రమం కొనసాగిస్తానని తెలిపారు.లక్కీ డ్రాలో గెలుపొందని మహిళలకు పసుపు,కుంకుమ,జాకెట్ ముక్కలను అందజేశారు.కార్యక్రమంలో బత్తుల నానాజీ,రావిపాటి గోవింద్‌రావు,కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం,దేశాల నరేష్,నాగ రమేష్,వీరాంజలి,మళ్ల అదిశేషు,కాకర దుర్గారావు,పోతుల బుల్లబ్బాయి,నందూరి దుర్గారావు,కోటేశ్వరరావు,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.





## పి 4 నీడ్ అసెస్మెంట్ సర్వే పరిశీలన

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 30:**
పి 4 నీడ్ అసెస్మెంట్ సర్వేను ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం పరిశీలించారు. 16వ వార్డులో బుధవారం ఆయన సర్వేను పరిశీలించారు. వార్డులో పి4 అవగాహన సభ ఏర్పాటు చేశారా, లేదా అని అడిగారు. పి4 యాప్ ద్వారా అరత గల బంగారు కుటుంబాల వివరాలు పరిశీలించారు.అందుబాటులో ఉన్న రెండు బంగారు కుటుంబాల సభ్యులను కలిసి వారి ఆర్థిక పరిస్థితి, పిల్లల చదువులు, ఆరోగ్య పరిస్థితులు, వారు కోరుకుంటున్న అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఇంచార్జి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవోను ఆదేశించారు. ఆర్డిఓ ఖతిబ్ కౌసర్ భానో, వార్డు పరిపాలన కార్యదర్శి సీ.హెచ్ మోహన్ కృష్ణ, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## అమీనాబాద్ గ్రామంలో పల్లె నిద్ర

**రాజవొమ్మంగి పెన్ పవర్ జూలై 30 :**
ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు జెడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి అమీనాబాద్ గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. జెడ్డంగి ఎస్ఐ చిన్నబాబు స్వయంగా పాల్గొని గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలను వివరించారు. నకిలీ ప్రకటనల ద్వారా డబ్బులు వసూలు చేస్తూ మోసాలు చేస్తున్న తీరును తెలియజేశారు. ఇటువంటి దొంగదారులను గుర్తించి జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. బాల్యవివాహాల వల్ల పిల్లల జీవితం ఎలా నష్టపోతుందో స్పష్టంగా వివరించారు. చిన్న వయసులో వివాహం వల్ల ఆరోగ్య సమస్యలు, విద్యా అంతరాయం, భవిష్యత్‌పై నెగెటివ్ ప్రభావం ఏర్పడుతుందని వివరించి, అటువంటి వివాహాలను పూర్తిగా నిరోధించాల్సిన అవసరాన్ని చెప్పారు.పొలాలలో అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం వల్ల ప్రాణహాని కలగవచ్చని, ఇది చట్ట విరుద్ధ చర్య అని తెలియజేశారు. ఇటువంటి చర్యలు తక్షణమే మానుకోవాలని సూచించారు. వాహనాలను నిబంధనల మేరకు నడపాలనీ, తలకవచం ధరించకపోవడం ప్రమాదకరమనీ, మద్యం సేవించి వాహనం నడపడం జీవితం మీదే పొరపాటు అవుతుందని వివరించారు. మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న మొబైలు దరఖాస్తు గురించి వివరించారు. అందులో ఎలా నమోదు కావాలి, అత్యవసర సమయంలో దానిని ఎలా ఉపయోగించాలి అనే అంశాలను చక్కగా వివరించారు. మత్తు పదార్థాల తయారీ, నిల్వ, రవాణా, వినియోగం వంటి చర్యలు తీవ్ర నేరాలు అని స్పష్టం చేశారు. వీటి పై ప్రత్యేక నిషేధ చట్టం ప్రకారం కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. యువత ఇటువంటి మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమం గ్రామస్తుల్లో చక్కటి స్పందనను పొందింది. పోలీసు శాఖ చట్టాలను అర్థవంతంగా తెలియజేయడంతో ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని అభిప్రాయపడ్డారు.



## బాల్యవివాహాలు వద్దు బడిబాటే



**సీతానగరం, పెన్ పవర్, జూలై30:**
సీతానగరం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఏవి కేచైతన్య మండల స్త్రీశక్తి భవన్ లో టీనేజ్ (బాల్య వయస్సు)గర్భాల నివారణ గురించి మండలం లోని వైద్య ఆరోగ్యశాఖ,శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్ సిబ్బందికి సంయుక్త అవగాహన సదస్సునిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ 19సం.లోపు వయస్సు ఉన్న బాలికల కు బాల్యవివాహాలు జరిపించడం వల్ల వారు వెనువెంటనే గర్భం ధరించడం వల్ల అనేక ఆరోగ్య మరియు సామాజిక అనర్థాలు సంభవిస్తున్నాయని కావున ఈ విషయం మీద కిషోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు,ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించాలని, ప్రతిగ్రామం లోనూ ఉన్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు తప్పని సరి గా బాల్య వివాహాలు, బాల్య గర్భధారణ లు అరికట్టడం లో గట్టి కృషి చెయ్యాలని తెలిపారు , ఇప్పటికే బాల్యవివాహం జరిగిపోయిన వారికి ఇప్పుడే గర్భం దాల్చకుండా తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించేలా చేసి గర్భధారణను కొంతకాలం వాయిదా అయ్యేలా చూడవలెనని చెప్పారు. అనంతరం 12.8.2025 న జరపబడే "నులిపురుగుల నివారణ కార్యక్రమం"గురించి చెబుతూ ఆరోజు మండలంలోని 1సం.నుండి 19 సం.వయసున్న పిల్లలు అందరికీ అన్ని అంగన్వాడీ కేంద్రాలు,అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాట శాలలు ,కాలేజీల లో అల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందని ఆరోజు బడికిరాని పిల్లలకు 20వ తేదీన జరిగే మాప ప్ రౌండ్ లో అల్బెండ జోల్ మాత్రలు మింగిస్తారని తెలియజేశారు. ఈకార్యక్రమంలో కోరుకొండ ఐసిడిఎస్ అసిస్టెంట్ సి. డి. పి.ఓ పి. వరలక్ష్మీ,ఎంపీహెచ్ఓ వై.ఎస్.రాయుడు, పిహెచ్ఎన్ కె. ఆదిలక్ష్మి,సూపర్వైజర్ కే. సుధాకర్, ఐసిడిఎస్ సూపర్ వైజర్స్ కే.పెద్దలక్ష్మీ, జి.ఇందిరా భారతి, ఏఎన్ఎమ్ లు, అంగన్వాడి టీచర్ లు తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో సహకార సంఘాలు బలోపేతం

### ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



పెద్దాపురం, పెన్ పవర్, జూలై 30 :

సమిష్టి కృషితోనే సహకార సంఘాలు బలోపేతమవుతాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండల పరిధిలోని పులిమేరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), డైరెక్టర్లుగా గోపు పల్లయ్య, బందా వెంకట్రావు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప హాజరై మాట్లాడుతూ పీఏసీఎస్ లు బలోపేతానికి డీసీసీబీ, ఆప్కాబ్ లు కృషి చేస్తున్నాయని, అందుకు అనుగుణంగా నూతన పాలకవర్గం, సంఘ సిబ్బంది బాధ్యత, అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను, సహకార బ్యాంకులు అందిస్తున్న రుణాలు, రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. నూతన అధ్యక్షుడు తుమ్మల బాబు మాట్లాడుతూ రైతులకు ఆమోదయోగ్యమైన విధి విధానాలను సంఘం ద్వారా అమలు చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ప్రతీ పథకాన్ని వారికి చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, రుణాలను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ, టీడీపీ మండలాధ్యక్షుడు మొయిళ్ళ కృష్ణమూర్తి, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, లింగంపర్తి పీఏసీఎస్ అధ్యక్షుడు పెంటకోట మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి గణనీయమైన మద్దతు



### స్కిల్ డెవలప్మెంట్, పిఎ సిఎస్ డిజిటలైజేషన్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం: ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నలపై కేంద్రం సమాధానాలు

### నైపుణ్యాభివృద్ధిలో ఔత్సాహిక స్పందన

కాకినాడ స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,జూలై 30:

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు గారు అడిగిన కీలక ప్రశ్నలపై కేంద్ర మంత్రులు ఇచ్చిన సమాధానాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నైపుణ్యాభివృద్ధి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల డిజిటలైజేషన్ రంగాల్లో కేంద్రం చూపిస్తున్న ప్రాధాన్యతను మరోసారి ప్రతిబింబించాయి.నైపుణ్యాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ పురోగతి.కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జయంత్ చౌదరి ఇచ్చిన సమాచారం ప్రకారం:కాకినాడలో ఇప్పటికే 192 మంది యువతకు ఫ్యూచర్ స్కిల్స్ శిక్షణ ఇవ్వబడింది.ఇందుకోసం రూ.13.20 లక్షలు ఖర్చు కాగా, అభ్యర్థులు ఏఐ మషీన్ లెర్నింగ్, బిగ్ డేటా, డిజిటల్ మార్కెటింగ్ వంటి రంగాల్లో శిక్షణ పొందారు.పీఎం కెవివై 4.0 ద్వారా ఏర్పాటైన శిక్షణ కేంద్రాలు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు సన్నద్ధత కల్పిస్తున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా 10,078 మంది శిక్షణ పొందగా, రూ.5.64 కోట్లు వెచ్చించారు.ప్రస్తుతం రాష్ట్రంలో 67 శిక్షణ కేంద్రాలు, 356 పబ్లిక్ ప్రైవేట్ శిక్షణ కేంద్రాలు, 14 ప్రత్యేక కేంద్రాలు పనిచేస్తున్నాయి.సిస్కో, మైక్రోసాఫ్ట్, ఐబిఎం, ఏడబ్ల్యూ ఎస్ వంటి అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో శిక్షణ అందుతోంది.ఏఐ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సును ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశపెట్టారు.పీఏసీఎస్ డిజిటలైజేష న్‌లో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్కేంద్ర సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా సమాధానంలో పేర్కొనగా: రాష్ట్రవ్యాప్తంగా 2037 పీఏ సిఎస్ ఉన్నాయి.ఇందులో 2020 పీఏ సిఎస్ లు జూన్ 30, 2025 నాటికి ఈఆర్పి వ్యవస్థలోకి వచ్చాయి. మిగిలిన పీఏసీఎస్ లు కూడా 2027 మార్చి 31 నాటికి డిజిటలైజేషన్ పూర్తి చేయనున్నారు.ఈ కార్యక్రమాన్ని నాబార్డ్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నారు. డిజిటలైజేషన్ తరువాత పీఏ సిఎస్ లు రేషన్ పంపిణీ, బ్యాంకింగ్ సేవలు, రూపే-కెసిసి కార్డులు, వ్యవసాయ ఇన్‌పుట్ పంపిణీ లాంటి సేవలను అందించగలవు.ఎంపీ సానా సతీష్ బాబు పార్లమెంట్ వేదికగా రాష్ట్రానికి మేలు చేసే ప్రాధాన్య అంశాలను ఎత్తిచూపుతూ, కేంద్ర దృష్టిని ఆకర్షించడం రాష్ట్రాభివృ ద్ధిలో కీలకంగా నిలుస్తోంది. కేంద్రం ఇచ్చిన సమాధానాలు రాష్ట్రానికి మద్దతును స్పష్టంగా తెలియజేస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### సీనియర్ ఉపాధ్యాయురాలు రాధాకుమారి

# సేవలు అభినందనీయం



### గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య



గంగవరం, పెన్ పవర్, జూలై 30:

గిరిజన ప్రాంతంలో 40 సంవత్సరాలు పాటు విద్యాభివృద్ధికి కృషి చేసిన సీనియర్ ఉపాధ్యాయులు బి రాధాకుమారి అభినందనీయమని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య అన్నారు.గంగవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తూ, 40 సంవత్సరాల పాటు గిరిజన సంక్షేమ విద్యాశాఖలో ఉపాధ్యాయురాలిగా ఉత్తమమైసేవలందించి పదవి విరమణ చేయనున్న రాధా కుమారి సన్మాన కార్యక్రమం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోలుపల్లి వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన పదవి విరమణ సన్మాన కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, మండల విద్యాశాఖ అధికారి టి. మల్లేశ్వరరావు, విశ్రాంత పి ఎం ఆర్ సి ఏవో పేరు నాయుడు ముఖ్య అతిథిలుగా పాల్గొని రాధా కుమారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిడి రుక్మండాయ్య ప్రసంగిస్తూ గిరిజన విద్యాభివృద్ధికి 40 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా రాధా కుమారి సేవలు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. గిరిజన విద్యా సేవకు అంకితమైన రాధాకుమారి సేవలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. విశ్రాంత పరిపాలనాధికారి పేరునాయుడు మాట్లాడుతూ 1985 నుండి రాధాకుమారి ఏజెన్సీ పాఠశాలలో విద్యాభివృద్ధికి సేవలందించారన్నారు. విశ్రాంత గిరిజన సంక్షేమ అధికారులు ప్రసాద్ , ప్రసాద్ బాబు, అకులు వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుల్లో రాధాకుమారి ఒకరని ఆమె అందించిన సేవలు అభినందనీయం అన్నారు. మండల విద్యాశాఖ అధికారి టి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు మార్గదర్శకులని ఆ ఉపాధ్యాయ వృత్తిలో ఎందన్నో తీర్చిదిద్దిన ఉపాధ్యాయురాలు రాధాకుమారి 40 సంవత్సరాల సేవలందించడం ఎంతో అభినందనీయం అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే . కృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిగా రాదా కుమారీ ఎన్నో ఉత్తమ సేవలు అందించారని పదోన్నతులను సైతం వదులుకొని పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయడం ఎంతో ఆనందదాయకమని, అభినందనీయమని పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు , రచయితలు ఎన్ ఎం పట్నాయక్, ఇమ్మానియేల్ , గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బి వి ఎస్ రామారావు, బి నాగేశ్వరరావు, శ్రీరాములు , బిఎస్ కుమార్ తదితరులు వారి ప్రసంగాల్లో రాధాకుమారి అందించిన సేవలను అభినందించారు. రాధా కుమారి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నో సేవలు ఆమె సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, యుటీఎఫ్ నాయకులు, బంధువులు, పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల తరఫున ఘనంగా సన్మానించారు. ఆమెతో పాటు పనిచేసిన ఉపాధ్యాయులు సహోపాధ్యాయులు ఏజెన్సీ నుండి భారీగా తరలివచ్చారు. రాధా కుమారి తో పాటు గిరిజన సంక్షేమ శాఖలో 1985లో ఉపాధ్యాయుల నియమితులైన ఉపాధ్యాయులు అందరూ కుటుంబ సమేతంగా సన్మాన కార్యక్రమానికి హాజరై ఆనందోత్సవం గా గడిపారు. తమ సర్వీసులో చేసిన సేవలను కష్టనష్టాలను గుర్తు చేసుకున్నారు. వ్యాఖ్యాతగా సీనియర్ ఉపాధ్యాయిని ఉమాదేవి వ్యవహరించారు. పాఠశాల డిప్యూటీ వార్డెన్ మడకం లావణ్య, ఉపాధ్యాయులు లక్ష్మి, భవాని, లలిత, సత్యవతి, మీనా కుమారి, ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ శేఖర్ బాబు, విశ్రాంత గ్రంథాలయ అధికారి వి. లక్ష్మయ్య, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు రాంబాబు, అడ్డతీగల, గంగవరం మండల యూటీఎఫ్ గౌరవ అధ్యక్షులు పి రాంబాబు, వి రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.





## జీలుగుమిల్లి ఎస్సైగా క్రాంతి కుమార్



**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,జూలై 30:** జీలుగుమిల్లి ఎస్సైగా వి క్రాంతి కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవని అన్నారు. పేకాట, కోడిపందాలు జూద క్రీడల జరగ కుండా ప్రత్యేక నిఘా పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉందని అధికారులు, నాయకులు, ప్రజలు సహకరించాలని సూచించారు.

## మండలంలోని పలు గ్రామాల్లో భూముల రీ సర్వే

- తహశీల్దార్ లావణ్య



**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 30:** తాళ్లపూడి మండలంలో రీ సర్వే ఫేజ్ 3 లో భాగంగా అన్నదేవరపేట, తాళ్లపూడి, కుకునూరు, వేగేశ్వరపురం, పెద్దేవం, మలకపల్లి, గ్రామాలలో మొదట రీ సర్వే జరుగుతుందని తహశీల్దార్ లక్ష్మీ లావణ్య తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులు, భూమిపై గల వ్యత్యాసాలను గుర్తించి సరిచేయడం జరుగుతుందని, గ్రామ సరిహద్దులు నిర్ధారించడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామంలో గల ప్రభుత్వ భూముల యొక్క సరిహద్దులకు కొలతలు వేసి నిర్ధారించడం, రైతువారీ భూములను సర్వే చేసి రీ సర్వే రికార్డులు తయారు చేయడం జరుగుతుందని తెలియజేశారు. కావున పైన తెలిపిన గ్రామాల్లోని ప్రజలు, రైతులు గ్రామంలో గల గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్ లకు సహకరించాలని సూచించారు.

### జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీలో

## కన్నబాబు, బాబు, బత్తుల సత్తిబాబు

**గోకవరం, పెన్ పవర్, జులై 30 :** జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఏర్పాటుచేసిన నియోజకవర్గం అభివృద్ధి కమిటీలో మండలం నుండి ముగ్గురికి చోటు దక్కింది.తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు హెలోనిస్ ప్రశాంత్ కుమార్ (కన్నబాబు), జనపరెడ్డి సుబ్బారావు (కొత్తపల్లి బాబు), బత్తుల సత్తిబాబులను నియోజకవర్గ అభివృద్ధి కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యే నియమించారు.నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో జరుగుతాయని ఎమ్మెల్యే నెహ్రూ చెప్పారు.

## సచివాలయ సిబ్బందికి ఘన సన్మానం



**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 30:** గజ్జరం గ్రామ పంచాయతీలో బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బందికి బుధవారం గ్రామ సర్పంచ్ గండి రాంబాబు, ఉప సర్పంచ్ దండమూడి శేషగిరి అధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. మణికుమార్, భారతి, కరుణా, సుధీర్, పద్మ బదిలీపై వెళ్లారు. వీరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు సచివాలయానికి సన్మానగ్రహీతలు అందించిన సేవలను కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్, ఇతర సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### సీఐను మర్యాదపూర్వకంగా కలిసిన

## జనసేన నాయకులు



**చింతూరు, పెన్ పవర్, జూలై 30:** చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా చిత్రడా గోపాలకృష్ణ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జనసేన పార్టీ చింతూరు మండల నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించిన వారు, చింతూరులో శాంతి భద్రతల పరిరక్షణలో ఆయనకు సంపూర్ణ సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు తీగల రవి, ప్రధాన కార్యదర్శి బేడే సతీష్, సీనియర్ నాయకుడు పెయ్యాల నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి పొడియం నాగార్జున, మండల నాయకులు ఎం సతీష్, మల్లెల ప్రదీప్, తిప్పని గణేష్, ఐక్క గణేష్, పూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు. సీఐ గోపాలకృష్ణ తన విధుల్లో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుని చింతూరులో శాంతి వాతావరణం కొనసాగించే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## ఎమ్మెల్యే ని కలిసిన క్రైస్తవ జేఏసీ ప్రతినిధులు

**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూలై 30 :** పోలవరం నియోజకవర్గం లోని పాస్టర్లు కొన్ని సమస్యలు, సమాజంలో ఎదుర్కొంటున్న అడ్డంకులు వారికోసం అవసరమైన ప్రభుత్వ సహాయాలపై ఎమ్మెల్యే సిరి బాలరాజుని జేఏసీ ప్రతినిధులు కోరారు. బుధవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని



కలిశారు. క్రైస్తవ పాస్టర్ల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపించాలని వారికి న్యాయం జరగాలని దిశగా కార్యాచరణ చేపట్టాలని కోరడం జరిగింది. దీనితో ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ క్రైస్తవ పాస్టర్ల సమస్యలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులతో చర్చించి తగిన పరిష్కారాలు చూపుతానని వారికి హామీ ఇచ్చారు. క్రైస్తవ జేఏసీ ప్రతినిధులు ఎమ్మెల్యేకి అభినందనలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం క్రైస్తవ జేఏసీ అధ్యక్షులు, గ్రేస్ మందిర్ వ్యవస్థాపకులు బి ఎజ్రా శాస్త్రి, కార్యదర్శి నిరీక్షణ రావు, ట్రెజరర్ టీ పాల్, దేవ సహాయం, స్టీఫెన్ ,జోసెఫ్, ఏసుబాబు, జాన్ విల్సన్, వసంత తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ



**గోకవరం, పెన్ పవర్, జులై 30 :** జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా బుధవారం మండల కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు అధ్యక్షతన గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ గుమ్మళ్ళదొడ్డి గ్రామంలోని పలు వీధులలో తిరిగి డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఎక్కువగా డెంగ్యూ జ్వరాలు వస్తాయి కాబట్టి డెంగ్యూ నివారణ చర్యలో భాగంగా పరిసరాల పరిశుభ్రత,నిల్వ ఉన్న నీటిని గుర్తించడం వాటిని వెంటనే తొలగించడం,నిల్వ నీటిపై మూతలు వేయడం, నీటి తొట్టి మీద ట్యాంకుల పైన, సంపుల మీద మూతలు పెట్టడం వంటి తగు జాగ్రత్తలు తీసుకుని, ఎవరికైనా డెంగ్యూ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తగిన చికిత్స కొరకు తీసుకుని వెళ్లాలని ప్రజలకు సూచించారు.ఎవరికైనా జ్వరం,ఒళ్ళు నొప్పులు, ఒంటి పై దద్దుర్లు ఎక్కువగా ఉన్న వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకుని వెళ్ళాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు యేగి సత్తిబాబు, జిల్లా కార్యదర్శి పి దేవానందం, జిల్లా కోశాధికారి పి చిన్ని, సచివాలయం కార్యదర్శి పీ వీ రమణ కుమారి,కే రామచంద్రరావు, డి సీతాశివ,జీఎమ్ స్వామి, ఎన్ కృపారాణి, మండల పీఎంపీ సభ్యులు వై పవన్ కుమార్, ఎమ్ నాగేశ్వరరావు, డి నాగార్జున, జి నాని, జి వెంకటేష్,ఎస్ అర్జునరావు కెల్లా జ్యోతి, ఐ నాగేశ్వరరావు, వై ప్రసాద్, ఎమ్ మల్లేష్,సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆధునిక యంత్రాలతో వ్యవసాయం లాభసాటి

### ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 30:** వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 80% రాయితీతో రైతులకు డ్రోన్లు అందిస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ లో గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన శ్రీ రామ కిసాన్ డ్రోన్ సిహెచ్ సి రైతు గ్రూపుకు డ్రోన్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీలో వ్యవసాయ పెట్టుబడులను తగ్గించడానికి సకాలంలో పురుగు మందులు మరియు సూక్ష్మ ఎరువులను పంటలకు అందించడానికి వ్యవసాయ డ్రోన్ పరికరాలను వినియోగించేలా సబ్సిడీపై వాటిని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. వాటితో అన్నదాతలు ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేసేలా చర్యలు తీసుకుంటోందన్నారు. సాగుకు సాంకేతికతను జోడిస్తే ఖర్చులు ఆదా అవుతాయని, సేద్యం లాభసాటిగా మారుతుందని ఈ ఏడాది ప్రభుత్వం జిల్లాల వారీగా పరిమితంగా రైతు గ్రూపులకు డ్రోన్లు అందిస్తుందన్నారు. అన్నదాతలను ప్రోత్సహించడానికి రాష్ట్రానికి 875 యూనిట్లు మంజూరు చేసిందని ఐదుగురు రైతుల గ్రూపును లబ్ధిదారులుగా గుర్తించిందని, జిల్లాల వారీగా ఎంపిక పూర్తి చేసి వ్యవసాయ శాఖతో వారికి శిక్షణ ఇప్పించి ఈ డ్రోన్లు అందిస్తున్నామన్నారు. రూ.8 లక్షల రాయితీతో ఒక్కో యూనిట్ ధర రూ.9.80 లక్షలు, ఇందులో రైతుల వాటా రూ.1.80 లక్షలు మిగిలిన రూ.8 లక్షలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతుల వాటాను బ్యాంకుల ద్వారా రుణమిప్పించి డ్రోన్ కంపెనీలకు చెల్లించేలా చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. వ్యవసాయ శాఖ ఏడి శ్రీనివాస్, మండల అధికారి రెడ్ల శ్రీరామ్ మాట్లాడుతూ గండేపల్లి మండలంలో ఇప్పటికే రెండు డ్రోన్లు అందించామని ఇంకా 3 అందుబాటులోకి వస్తున్నాయని ఆసక్తి గల రైతులు మమ్మల్ని సంప్రదించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ లక్ష్మణరావు, పోతుల మోహనరావు, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, కాటేపల్లి భద్రరావు, కొల్లు త్రిమూర్తులు, మురళి రాజు, బద్ది సురేష్, శ్రీరామ కిసాన్ లోన్ సిహెచ్ గ్రూప్ కన్వీనర్ డి పార్వతి, కో కన్వీనర్ వి సుహాసిని, గ్రూప్ సభ్యులు డి రత్న భద్రం, కే భద్ర రావు, డి భద్రరావు, డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

### వైసిపి యువనేత అభిషేక్ బాబు



**టీ. నర్సాపురం, పెన్ పవర్, జూలై 30:** ఇంటికి,షాపులకు అదానీ స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ప్రజలు వ్యతిరేకించాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త మరియు వైఎస్సార్ సీపీ యువ నేత పెండ్యాల అభిషేక్ బాబు అన్నారు.ప్రజలు ఇప్పటికే అప్పులతో,ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతుంటే మూలిగే నక్క పై తాటికాయ పడినట్లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటికి,షాపులకు అదానీ కరెంట్ స్మార్ట్ మీటర్లను బిగించడం అంటే ప్రజలపై మరిన్ని భారాలువేయడమేననిఅన్నారు.అధికారంలోకి వస్తే కరెంట్ బిల్లులు ఒక్క పైసా పెంచబోమని చెప్పి దాదాపు 13 సార్లు పెంచి మాటతప్పారన్నారు.సామాన్యులకు, వ్యాపారులకు ఇదిమోయలేని భారంగా ఉందన్నారు.సెల్ ఫోన్ రీఛార్జ్ చేయించుకున్నట్లు ముందుగానే కరెంట్ బిల్లు రీఛార్జ్ చేయించుకోవడం అన్యాయం అన్నారు. అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చడం,ప్రజల సొమ్మును అదానీ కంపెనీకి దోచిపెట్టడమేనని తెలిపారు.కూటమి ప్రభుత్వం రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీలు పేరుతో, కస్టమర్ ఛార్జీలు,వడ్డీ ఛార్జీలు తదితర పేర్లతో అదనపు చార్జీలు ప్రజల నుండి ముక్కు పిండి వసూలు చేస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూగ్రహించి,వ్యతిరేకించాలని తెలిపారు.

## రాజపూడి హైస్కూల్ సమస్యలు పరిష్కరించండి




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 30:** జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలో సుమారు 600 పైగా విద్యార్థిని విద్యార్థులు ఉన్న హైస్కూల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం( పీడీఎస్ యు విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కదితి సతీష్ విమర్శించారు. బుధవారం ఏఐఎఫ్ టీయు, ఏపీ రైతు కూలి సంఘం, పీడీఎస్ యు సంఘాలు రాజపూడి హైస్కూల్ ని పరిశీలించారు. ఈ సందర్భంగా కదితి సతీష్ మాట్లాడుతూ రాజపూడి హైస్కూల్ పై మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, కనీస అవసరాలు తీర్చకుండా, పరిశీలించకుండా గాలికి వదిలేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం అవుతున్న కానీ విద్యారంగ వ్యవస్థలో ఎలాంటి మార్పులు రాలేదని, సమస్యలు సమస్యలుగానే ఉన్నాయని ఆయన తెలిపారు. తక్షణమే జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పందించి రాజపూడి హైస్కూల్ ని సందర్శించి మంచినీరుకి సంబంధించిన ఫిల్టర్ వాటర్, ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కోశాధికారి డాన్ శ్రీను, జాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కల్లేరు మోటు బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**చింతూరు, పెన్ పవర్, జూలై 30:** చింతూరు మండలంలోని కల్లేరు మోటు బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని మృతదేహం కనుగొనడం కలకలం రేపింది. సమాచారం అందుకున్న వెంటనే చింతూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. మృతుడి గుర్తింపు పనులు కొనసాగుతున్నాయని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

### 2.57 కిలోలు గంజాయి పట్టివేత

## ఐదుగురు అరెస్టు



**సీతానగరం, పెన్ పవర్, జూలై 30:** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీడి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నార్త్ జోన్ డిఎస్పి వై. శ్రీకాంత్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వైస్. సత్య కిషోర్ పర్యవేక్షణలో సీతానగరం మండలంలోని ఎస్సై డి. రామ్ కుమార్ కు వచ్చిన సమాచారం మేరకు గంజాయి అక్రమ రవాణా జరుగుతుంది అని అక్రమంగా ఒడిస్సా ఏజెన్సీ ప్రాంతాల నుండి కొనుగోలు చేసిగంజాయిని తరలిస్తున్నట్లు ప్రక్క సమాచారం అందడంతో పోలీసులు మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో మామిడి తోట వద్ద వాహనం తనిఖీ చేపట్టారు, ఐదుగురు వ్యక్తులను గమనించి వారి వద్ద 2.57కిలోలు గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. రెవెన్యూ అధికారులకు సమక్షంలో గంజాయిని సీజ్ చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు, వారి వద్ద 1500 రూపాయల నగదు ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల రవాణా చేస్తున్న విక్రయిస్తున్న లేదా సేవిస్తున్న అటువంటి వారి వివరాలు పోలీస్ వారికి తెలియజేయాలని కోరారు, గంజాయి రవాణా చేస్తున్న విక్రయిస్తున్న వారిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందని యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని తెలిపారు, ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సై బి సురేష్ , హెడ్ కానిస్టేబుల్ వాసం శెట్టి శ్రీనివాస్, గోవింద్, కానిస్టేబుల్ ఎల్లారావు, కుమార్, వెంకటేష్, రమేష్, మణి బాబు, తదితరులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే

# ప్లాస్టిక్ వాడకాన్ని నివారించండి

## డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్




**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 30**

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాచవరం గ్రామ పరిధిలో సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు ప్రజలు ప్లాస్టిక్ గ్లాసులు,కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని మనందరం అనారోగ్యాల పాలవుతామని డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్ తెలిపారు. షాపు యజమానులకు నోటీసులను అందించి,ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించాలని వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ పాలిథిన్ కవర్లు, గ్లాసులు వినియోగాన్ని ఆగస్టు 15వ తేదీలోగా నిలుపుదల చేయాలని, లేనిచో విక్రయించే వారిపై భారీగా జరిమానా విధించనున్నామన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని భావించి ఆ దుకాణాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసు ద్వారా తెలియజేశామన్నారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగించకుండా క్లాత్, జ్యూట్ సంచులను మాత్రమే వినియోగించాలన్నారు. షాపుల వద్ద డస్ట్ బిన్ లు ఏర్పాటు చేసి చెత్తను అందులో వేయాలన్నారు. షాపుల వద్ద డస్ట్ బిన్ లు ఏర్పాటు చేయని వారిపై రూ.200లు జరిమానా విధించనున్నామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తక్షణమే నిషేధించాలని షాపులవద్దకు వచ్చేవారికి వివరించాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో 30 మందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని,230 షాపుల యజమానులకు నోటీసులు జారీ చేసి, వారి నుండి ఎక్నాలెడ్జ్మెంట్ తీసుకున్నామని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.అలాగే బుధవారం వారపు సంతలో ఫిష్, మటన్, చికెన్,కూరగాయలు, హోటల్స్, పండ్ల దుకాణదారులకు ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధం పై అవగాహన కల్పించామని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.వి.వి. సత్యనారాయణ,సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 30:**

స్థానిక గోకవరం రోడ్డులోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పెద్దాపురం లలిత ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఆర్థిక సహాయంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. అనంతరం కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి లలిత ఎంటర్ ప్రైజెస్ అధినేతలు మట్టే సత్య ప్రసాద్, మట్టి శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదిశంకర్ హాజరై వాటర్ ప్లాంట్ విద్యార్థినిలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మట్టే శ్రీనివాస్, ఆదిశంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురుకుల పాఠశాలకు ఆర్వో ప్లాంట్ అడగడం జరిగిందని వెంటనే ఏర్పాటు చేశామని ఇంతమంది పిల్లలు ఇంత ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకుంటున్న మీకు ఉన్నత చదువులకు అన్ని విధాల సహకరించడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసే మట్టే సోదరులు అడిగిన వెంటనే ఈ గురుకుల పాఠశాలకు మంచినీటి సౌకర్యం కల్పించడమే కాకుండా బాలికల ఉన్నత చదువులు చదువుకోవడానికి సహకరిస్తామని తెలియజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. వీరు జగ్గంపేటలో డిగ్రీ కళాశాలకు ఆర్వో ప్లాంట్ ఇవ్వడం, కృష్ణవరం గ్రామంలో మరో ప్లాంట్ అందించడం జరుగుతుందన్నారు. అన్నవరంలో కళ్యాణమండపం, ప్రసాదం తయారు చేసే భవనం నిర్మించారని వీరు చేస్తున్న సేవలకు గుర్తించిన ప్రభుత్వం అన్నవరం శాశ్వత బోర్డ్ మెంబర్ గా అవకాశం కూడా కల్పించడానికి సిద్ధమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ విజయ క్లారిన్ కుమారి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, తిరుమలరాజు మురళి రాజు, బద్ది సురేష్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లకు కొత్త ఊపు



**కొత్తపేట, పెన్ పవర్, జూలై30:**

ఎన్టీఆర్ భరోసా పథకం కింద అరుహైన ప్రతీ ఒక్కరికి సామాజిక భద్రతా పింఛన్లు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.ఆయన మాట్లాడుతూ, కొత్తపేట నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాల్లో నూతనంగా 763 వితంతు (స్పౌజ్) పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందుకోసం 30లక్షలు52వేల రూపాయలు మంజూరు అయినట్లు వివరించారు.గతప్రభుత్వం కాలంలో భర్త మృతి చెందిన తరువాత భార్యకు పింఛన్ మంజూరులో విఫలమైందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అటువంటి వితంతువులకు న్యాయం చేయాలని నిర్ణయం తీసుకుందని ఆయన చెప్పారు. 2019 నుండి 2024 అక్టోబర్ మధ్య కాలంలో భర్తను కోల్పోయిన మహిళలకు ఈ పథకం లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే వివరించారు. ఈ క్రమంలో ఆగస్టు నెల నుండి నియోజకవర్గంలోని వితంతు కేటగిరీలో కొత్తగా 763 మందికి పింఛన్లు మంజూరు అయినట్లు తెలిపారు. అదనంగా, రావులపాలెం మండలానికి చెందిన ఒక డయాలసిస్ రోగికి 10వేల రూపాయలు డయాలసిస్ పింఛన్ మంజూరైనట్లు వెల్లడించారు.

# శాస్త్ర,సాంకేతిక విద్య వైపు ప్రతీ విద్యార్థి దృష్టి సారించాలి

## బిట్స్ పిలాని రిటైర్డ్ సైంటిస్ట్ నాగభూషణరావు



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 30,**

విద్యార్థులు పాఠశాల నుండి శాస్త్ర,సాంకేతిక విద్య వైపు ప్రతీ విద్యార్థి దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అవరోధించాలని బిట్స్ పిలాని రిటైర్డ్ సైంటిస్ట్, శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ కామిశెట్టి సత్యనాగభూషణరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో 6 నుంచి ఇంటర్ వరకు పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాతలు అందించిన సాయాన్ని హెచ్ఎం కదలి సాయిరామ్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. సత్యనాగభూషణరావు తల్లితండ్రులు కామిశెట్టి వీరాస్వామినాయుడు, సూర్యకాంతం ట్రస్ట్ పేరున 6 నుంచి ఇంటర్ వరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతో పాటు ప్రశంసా పత్రాలు, పెన్నులు, పోల్డర్లను అందజేశారన్నారు. సత్యనాగభూషణరావు ఆధ్వర్యంలో ట్రస్ట్ పేరున గత 26 ఏళ్లగా విద్యార్థులకు నగదు ప్రోత్సాహ బహుమతులను పంపిణీ చేస్తున్నారన్నారని హెచ్ఎం సాయిరామ్ వివరించారు.అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థి సత్యనాగభూషనరావును ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ కాలేజీ ప్రిన్సిపాల్ సాంబశివరావు, ఉపాధ్యాయులు బెహరా మూర్తి, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, నాగభూషణరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# పేదరికం లేని సమాజ సాధనే పీ4 లక్ష్యం

## పెద్దాపురం ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 30 :**

పేదరికం లేని సమాజ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్ షిప్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి అన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీ4 కార్యక్రమం అమలులో భాగంగా తాను దత్తత తీసుకున్న మండల పరిధిలోని కాండ్రకోట గ్రామానికి చెందిన మామిడి చక్రమ్మ కుటుంబాన్ని మంగళవారం ఆర్డీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చక్రమ్మ కుటుంబ సభ్యులతో ఏకాంతంగా సమావేశమై వారి అవసరాలు, ప్రస్తుత కుటుంబ ఆర్థిక పరిస్థితిని, ప్రభుత్వం నుంచి అందుతున్న ఇంటింటికీ కుళాయి, విద్యుత్తు కనెక్షన్లు, దీపం-2, రేషన్ సరుకులు, ఇతర సదుపాయాలు, సామాజిక పింఛన్, తల్లికి వందనం, విద్యార్థి మిత్ర కిట్లు ఇతర సంక్షేమ పథకాల వివరాలను ఆరా తీశారు. గృహం, కుటుంబ సభ్యుల యొక్క ఆరోగ్యం పరిస్థితి, పిల్లల చదువులు, ఉపాధి అవకాశాలు వంటి విషయాలను ఆర్డీవో నేరుగా కుటుంబ సభ్యులతో ముచ్చటించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో శ్రీరమణి మాట్లాడుతూ అట్టడుగున ఉన్న కుటుంబాలకు సంపన్న కుటుంబాలు సాయం అందించడమే పీ4 లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు మార్గదర్శకులుగా బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్డీవోగా తాను మూడు బంగారు కుటుంబాలను స్వీకరించడం జరిగిందన్నారు. సాయం చేసే వారిని మార్గదర్శిగా, సాయం పొందే వారిని బంగారు కుటుంబంగా పిలవడం జరుగుతుందని ఆమె తెలిపారు.

# కోనసీమకు గర్వకారణం

## ఆర్.కె. ఆచార్యులకు కీలక బాధ్యత



**కొత్తపేట, పెన్ పవర్, జూలై30:**

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన హైకోర్ట్ న్యాయవాది రామోజు నాగ వెంకట సత్య కామాచార్యులు (ఆర్.కె ఆచార్యులు) రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు ,అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలకు స్టాండింగ్ కౌన్సిల్గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. దీనికి సంబంధించి.జీ.ఓ. ఆర్.టి.నెం.244, తేదీ: 29.07.2025 న జారీ చేసిన ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ అందించారు. ఆర్.కె. ఆచార్యుల నియామకం పట్ల రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ ,మునిసిపల్ శాఖామాత్యులు పి. నారాయణ, జగ్గంపేట ఎమ్మెల్యే ,టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఏపీ హైకోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. చిదంబరం,సీనియర్ కౌన్సిల్ పి. గిరీష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టు న్యాయవాదిగా ఆచార్యులు ఇచ్చిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఆర్.కె. ఆచార్యులు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ఎంపిక

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 30:**



స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జగంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీని ప్రకటించారు. ఈ అభివృద్ధి కమిటీకి చైర్మన్ గా జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, సభ్యులుగా ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్ర రావు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, కోర్పు సాయి తేజ, జంపన సీతారామచంద్ర వర్మ, చదరం గోవిందరాజులు (చంటిబాబు) కంచుమర్తి రాఘవ, హాలో నిన్ ప్రశాంత్ కుమార్ (కన్నబాబు), జనపరెడ్డి సుబ్బారావు (కొత్తపల్లి బాబు) బత్తుల సత్తిబాబు తదితరులు నియమించినట్టు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో జరుగుతాయని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాల నుంచి ఈ కమిటీలో సభ్యులను వేయడం జరిగిందని అన్నారు.



# నేడు ఎండిఓ ఉద్యోగ విరమణ

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 30:**

స్థానిక ఎంపీడీవో మల్లాది విశ్వనాథ్ గురువారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈయన గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ముందు తాడేపల్లిగూడెం ఎం డి ఓ గా బాధ్యతలు స్వీకరించారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగునుంది. ఈ సందర్భంగా ఈయనను అధికారులు అనధికారులు ఘనంగా సత్కరించనున్నారు.

# మండలంలో ప్రతి స్కూలుకు యూనిఫామ్ అందజేత

## డిఇఓ మల్లేశ్వరరావు..



**అడ్డతీగల, పెన్ పవర్, జూలై 30:**

అడ్డతీగల మండలంలో 22 పంచాయతీ లలో ఉన్న 99 గ్రామాలలో 101 స్కూళ్లకు పిల్లలకు 100% యూనిఫారం సరఫరా చేయడం జరిగిందని రంపచోడవరం డి ఈ ఓ వై. మల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి తమ యూనిఫారములను సంబంధిత స్కూల్ నుండి తీసు కోవాల్సిందిగా ఆయన సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి యూనిఫామ్ ధరించాలని, అలాగే తల్లిదండ్రులు పిల్లలను యూనిఫామ్ ధరింపజేసి స్కూళ్లకు పంపించాల్సిన బాధ్యత తీసుకోవాలని డీఈవో తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి స్కూలుకు యూనిఫామ్ సరఫరా చేసిందని,ప్రతి ఒక్క విద్యార్థి విధిగా యూనిఫామ్ ధరించాలని డీఈవో మల్లేశ్వరరావు తెలిపారు.

# అభివృద్ధి పనులు పరిశీలించిన చైర్ పర్సన్

**మండపేట, పెన్ పవర్ జూలై 30:**



మండపేట పట్టణం 25వ వార్డు కరాచీ స్వీట్స్ వద్ద వాణీ మహల్ డౌన్ లో చేపట్టిన సి.సి డ్రైన్ కవర్ స్లాబ్ ల నిర్మాణ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధులు రూ 17లక్షల రూపాయలతో పట్టణంలో వివిధ వార్డుల్లో కల్వర్టు,డ్రైన్లు రిపేర్లు చేస్తున్నామన్నారు.అనంతరం 16వ వార్డులోని బి పి ఎస్ గ్రాంట్ తో నిర్మించిన సి.సి రోడ్డును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆమె వెంట వైస్సార్సీపీ నాయకులు ముక్కా సుబ్రహ్మణ్యం, జొన్నపల్లి సత్తిబాబు, ముక్కా దాలియ్య, డి.ఈ కె.శ్రీనివాసు,ఏ.ఈ డి.పవన్ తదితరులు ఉన్నారు.

# ఆదివాసి నవోత్సవాలు జయప్రదం చెయ్యండి



ఉన్నత చదువులతోనే ఆదివాసులు అభివృద్ధి

చట్టాల అమలయితేనే ఆదివాసులకు మనుగడ

ఆదివాసి నవోత్సవాలు జయప్రదం చేయాలంటూ ఆదివాసి సంక్షేమ పరిషత్ పిలుపు

ఎటపాక, పెన్ పవర్,జూలై 30:

అగస్టు ఒకటి నుండి జరగనున్న ఆదివాసి నవోత్సవాలు జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఆదివాసి సంక్షేమ పరిషత్ (274/16) అధ్వర్యంలో కొత్తూరు నారాయణపురం ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తూనే రాజ్యాంగంలో ఆదివాసుల కోసం కల్పించబడ్డ చట్టాల కొరకు హక్కుల కొరకు తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆదివాసీలు ఉన్నత చదువుల్లో రాణిస్తేనే అభివృద్ధి చెందగలరని అలాగే రాజ్యాంగం ద్వారా ఆదివాసులకు కల్పించబడిన చట్టాలు అమలు అయితేనే ఆదివాసులకు మనుగడ ఉంటుందని ఆయన అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆగస్టు 9 ని ఐక్యరాజ్యసమితి గుర్తించిందని. ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం కూడా ఆదివాసీలు సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆదివాసి సంస్కృతిని పరిరక్షించాలని , ఆదివాసి చట్టాలు ప్రతి దేశంలో పకడ్బందీగా అమలు జరగాలని తద్వారా ఆదివాసులు హక్కులు పొందగలరని ఆదివాసులు హక్కులు పరిపూర్ణంగా అందితేనే విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ ఫలాలు పొందగలరని తద్వారా అభివృద్ధి చెందుతారని ఈ యొక్క ప్రపంచ ఆదివాసి దినోత్సవం ముఖ్య ఉద్దేశమని ఆయన తెలియజేశారు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని , ఆదివాసి విద్యార్థులు ఉన్నత చదువులు రాణిస్తూ జాతీయస్థాయిలో రాష్ట్రస్థాయిలో సివిల్ సర్వీస్ ఉద్యోగాల్లో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివాసి ప్రాంతాలలో ఉన్న అన్ని పాఠశాలల్లో ఆదివాసి చట్టాలు హక్కులు , సంస్కృతి నీ పాఠ్యాంశాల్లో చేర్చాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే విద్యార్థులు చదువుకుంటూనే చదువుతోపాటు తమ జాతి మనగడ కోసం అస్తిత్వం కోసం రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం చైతన్యమై ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సాగుకు అనుమతి ఇవ్వండి



ఎటపాక, పెన్ పవర్, జూలై 30

స్థానికేతర భూస్వాముల నుండి పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం సేకరించిన భూములలో నిరుపేద ఆదివాసీలకు సాగుకు అనుమతి కోరుతూ ఆదివాసి గిరిజన సంఘం అధ్వర్యంలో ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ కు మురుమూరు, ఎర్రగట్టు, రాఘవపురం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ప్రతి బుధవారం చింతూరు ఐటీడీఏ లో ఏర్పాటు చేసే మీకోసం (గ్రీవెన్స్) కార్యక్రమం ఎటపాక మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ. అపూర్వ భారత్ ను ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. నందిగామ, మురుమూరు గ్రామాల్లో భూస్వాముల నుండి 2008 నుండి 2010 మధ్యలో పోలవరం ప్రాజెక్టు కోసం సుమారు 100 ఎకరాలు ప్రభుత్వం భూసేకరణ చేసి ఆ భూములకు నష్టపరిహారం అందజేశారన్నారు. అట్టి భూములను స్థానికేతరులైన భూస్వాములు స్థానిక గిరిజనేతర రైతులకు అక్రమంగా కౌలుకిస్తూ లబ్ది పొందుతున్నారనారు. ప్రస్తుతం అట్టి భూములు రెవిన్యూ రికార్డులలో పోరంబోకు మరియు ప్రభుత్వ భూమిగా నమోదయి ఉన్నదని, చట్ట ప్రకారం అట్టి భూములు ప్రభుత్వ భూములు అయినందున పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి బ్యాక్ వాటర్ వచ్చేంతవరకు స్థానికంగా జీవిస్తున్న ఆదివాసీ పేదలకు ఆ భూములను సేద్యం చేసుకునేందుకు తాత్కాలిక అనుమతి ఇప్పించగలరని వినతిపత్రంలో కోరారు. 18 సంవత్సరాల క్రితం ప్రభుత్వం నుండి పరిహారం పొంది మరల ఆ భూములను 25 నుండి 50 వేల వరకు కౌలుకు ఇస్తున్న భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాక అర్జున్ దొర, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి ఇరప అజయ్, నాయకులు సొందే రామారావు, సోయం వీరమ్మ, పర్శిక ధర్మరాజు , మురుమూరు, ఎర్రగట్టు, రాఘవాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి...

### పీ ఓ దృష్టికి తీసుకెళ్లిన జెడ్పీటీసీ ఉబ్బా.సుస్మిత



ఎటపాక, పెన్ పవర్,జూలై 30: ఎటపాక మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం లో బుధవారం చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ మీకోసం కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి కూనవరం, చింతూరు, వీఆర్ పురం మండలాల నుండి పలు సమస్యలు ఐటీడీఏ పిఓ. అపూర్వ భరత్ పలు సమస్యలపై వినతులు అందజేశారు,ఇందులో భాగంగా ఎటపాక మండల జడ్పీటీసీ ఉబ్బా. సుస్మిత ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకులపాడు, గుండాల, రాయనిపేట పంచాయితీలకు కలిపి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చెయ్యాలని అదేవిదంగా మండలం లో రోడ్డుకు ఇరువైపులా అనుకోని ఉన్న తుప్పలను తొలగించాలని, మండల పరిధిలో ని అర్ అండ్ బి కు రహదారులు కు మరమ్మత్తులు చేపట్టాలని,కేఏస్. పురం గ్రామానికి సీసీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని, సర్వే చేసిన 2023-24లో సర్వే చేసిన ప్రభుత్వ భూమిని అర్హులైన వారికీ పట్టాలు అందచేయ్యాలని మీకోసం కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి పీ ఓ అపూర్వ భరత్ దృష్టికి తీసుకెళ్లారు.

# జెసిబి తో అక్రమంగా బిఎస్ఎన్ఎల్ కేబుల్ లైన్ వైర్లు తొలగింపు



వై రామవరం, పెన్ పవర్,జూలై 30:

హౌసింగ్ కాలనీ నిర్మాణం కోసం స్థలాన్ని లెవెల్ చేస్తుండగా బిఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్లు కట్ అయిన సంఘటన చవిటి దిబ్బల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోనికి వెళ్తే గతంలో ఈ భవనంలో అర్ అండ్ బి గెస్ట్ హౌస్, ఆ తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ టవర్ చవిటి దిబ్బల గ్రామంలో ఉండేవని గ్రామస్తులు



అంటున్నారు. బుధవారం మధ్యాహ్నం అక్రమంగా ప్రొక్లైన్ తో ఇంటి నిర్మాణం కోసం చదును చేస్తుండగా బిఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్లు తెగిపోయాయని గ్రామస్తులు తెలిపారు. దీనివల్ల చవిటి దిబ్బలు బిఎస్ఎన్ఎల్ టవర్ పరిధిలో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం నుండి బిఎస్ఎన్ఎల్ సేవలు లేవని వినియోగదారులు తెలిపారు.ఇదే ప్రొక్లైనర్ తో గతంలో రెండు చోట్ల ఇదే విధంగా కేబుల్ లైన్ కట్ చేశారని గ్రామస్తులు తెలిపారు. ఆ సమయంలో కూడా వారం రోజులు బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నామని తెలిపారు. అక్రమంగా ఇంటి స్థలం కోసం భూమిని చదును చేసి, కేబుల్ వైర్ కట్ చేసి వినియోగదారులను అసౌకర్యానికి గురి చేసిన ప్రొక్లైన్ యజమాని పై కేసు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ సిబ్బందిని వివరణ కోరగా ప్రొక్లైనర్ తో చదును చేసిన స్థలము ఎవరి పరిధిలో ఉందో సర్వే చేయించి పూర్తి వివరాలు తెలియజేస్తామని అన్నారు.

# నేడు మండల పరిషత్ సమావేశం

తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 30:

తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎండిఓ. విశ్వనాథ్ తెలిపారు. సమావేశంలో మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష చేస్తారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొననున్నారు.

# కిల్కారి మొబైల్ అకాడమీ ద్వారా గర్భిణీ, బాలింతలకు సేవలు

పెన్ పవర్, ఉంగుటూరు జూలై 30:




కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జరిగిన అవగాహన సమావేశంలో ప్రోగ్రామిక్ ఆఫీసర్ రాజు మాట్లాడుతూ, కిల్కారి, మొబైల్ అకాడమీ ద్వారా మాతా శిశు ఆరోగ్యం మెరుగుపడుతోందన్నారు. గర్భిణీలు నాలుగో నెల వచ్చేసరికి వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఏఎన్ఎంలకు సూచించారు. ఈ సమాచారం ఆధారంగా కిల్కారి వాయిస్ కాల్స్ వారానికి ఒకసారి 01244451660 నంబరుతో వస్తాయని తెలిపారు. తల్లులు ఆరోగ్య సలహాల కోసం 14428 టోల్ ఫ్రీ నంబరుకు కూడా కాల్ చేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు పి. మానస, ఇ. అనూష, ఎంపీహెచ్‌వో కె. శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ కె. నాగమణి, ఎంపీహెచ్ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో విశిష్ట పూజలు

## దాతల నుంచీ నిత్యాన్నదానానికి భరోసా

ఆత్రేయపురం,పెన్ పవర్ జూలై 30:




ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ స్వామి గోపాల స్వాముల వారి ఆలయంలో వేకువజామున అత్యంత వైభవంగా విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు.స్వామివారి దర్శనార్థం భక్తులు తెల్లవారుఝామునే ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణలతో స్వామివారికి అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించి, ప్రత్యేక నైవేద్యాలతో పూజలు చేశారు.భక్తులు వినతులు చెల్లించుకుని తీర్థప్రసాదం స్వీకరించారు. ఆలయంలో నిత్యం కొనసాగుతున్న నిత్య అన్నదాన పథకం కోసం హైదరాబాద్‌కు చెందిన విష్ణుభట్ల నాగ కృష్ణ శ్రీనివాస్, ఉదయభారతి దంపతులు ప్రత్యేకంగా రూ.10,116ని ఆన్‌లైన్ ద్వారా విరాళంగా సమర్పించడం ఆలయ నిర్వాహకుల్లో ఆనందాన్ని కలిగించింది. భక్తుల ఆదరణతో కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమం ఆలయ మహత్యాన్ని మరింత పెంచుతోందని ఆలయ ఈవో బి. వేంకటరమణమూర్తి తెలిపారు.దాతలందించిన విరాళాలకు రసీదు, బాండ్, స్వామివారి చిత్రపటం, ప్రసాదం మొదలైనవి పోస్టు ద్వారా పంపిస్తాం. భక్తుల విశ్వాసం తోడుగా ఈ పథకం కొనసాగుతోంది," అని ఆయన పేర్కొన్నారు.

# ఆదర్శ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావుకు ఘన సత్కారం



కె గంగవరం పెన్ పవర్ జులై 30:

విద్యా రంగంలో విశేష సేవలందించిన ఆదర్శ ఉపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు ఘన సత్కారం జరిగింది. యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవా సంస్థ అందజేసిన 'ఆదర్శ ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయుడు' అవార్డును పురస్కరించుకుని, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది వెంకటేశ్వరరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్కార సభకు పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పితాని శ్రీనివాసులు అధ్యక్షత వహించగా, జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సభలో ప్రాథమిక విభాగ ప్రధానోపాధ్యాయుడు వి.ఎస్.ఎన్. మూర్తి, యుటిఎఫ్ సీనియర్ నాయకుడు దాసరి శ్రీను, ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, శ్రీధర్ ఏడుకొండ, హిందీ ఉపాధ్యాయిని అయ్యంగారి లక్ష్మీ తదితరులు పాల్గొని వెంకటేశ్వరరావు సేవలను ప్రశంసించారు.వెంకటేశ్వరరావు నాయకత్వంలో పాఠశాల రెండు సార్లు రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనలకు ఎంపికై ప్రశంసలు అందుకుంది. షైనింగ్ స్టార్ అవార్డు, ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో అత్యధిక విజయం సాధించడం వంటి అనేక విజయాలతో పాఠశాల ఖ్యాతిని పెంచారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కమిటీ సమావేశం

**అమలాపురం పెన్ పవర్ జూలై 30:**

కోనసీమ జిల్లాలో హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ చర్యల అన్ని పారామీటర్లలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పథక సంచాలకులు డాక్టర్ కె.నీలకంఠారెడ్డి హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కమిటీ సమావేశం డిఆర్ఓ, రాజకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పథక సంచాలకులు మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ చట్టం 2017 హెచ్ఐవి తో బాధపడే వారికి రక్షణ కవచం అన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలన దిశగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రత్యేక చొరవ తీసు కొని నిర్దేశిత పారామీటర్లలో ప్రగతిని సాధిస్తూ జిల్లాను ఎయిడ్స్ నియంత్రణ చర్యలలో ముందంజలో నిలపాలని సూచించారు. హెచ్ఐవి ఎయిడ్స్ కౌన్సిలింగ్ పరీక్షా కేంద్రాల నిర్వహణ సుఖ వ్యాధులు నివారణ ఏరియా అనువ త్రులలో లైంగిక వ్యాధుల క్లినిక్స్, ఏఆర్టీ కేంద్రాలు నిర్వహణ సేవలను మరింత బలోపేతం చేస్తూ నివారణా చర్యలను పక్కగా నిర్వహించాలని ఆదేశించారు. హెచ్ ఐ వి రహిత రక్త మార్పిడి చర్య లు ఏఆర్టీ కేంద్రాలు అను బంద లింక్ ఏఆర్టి ప్లస్,లింకు ఏఆర్టి కేంద్రాల ద్వారా ప్రతినెల ఎటువంటి గ్యాపులకు ఆస్కారం లేకుండా ఉచితంగా మందులు పంపిణీ జరగాలన్నారు. జిల్లాలో ప్రతి మూడు నెలలకు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి నియంత్రణ చర్యలను బలోపేతం చేస్తూ వ్యాధి వ్యాప్తిని అరికడుతూ మరణాల రేటును తగ్గిం చాలన్నారు.జిల్లా కొన్ని పారామీటర్లలో వెనుకం జలో ఉందని, మెరుగైన పనితీరును కనబరుస్తూ వ్యాధుల నియంత్రణలో పురోగతిని సాధించాలని ఆయన స్పష్టం చేశారు. నూతనంగా జన్మించిన బిడ్డలకు హెచ్ఐవి రాకుం డా గర్భిణీ స్త్రీల విషయంలో గర్భం దాల్చిన నాటి నుండి అప్రమత్తంగా ఉంటూ నియంత్రణ చర్యలను పక్కాగా చేపట్టాలన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ నియం త్రణ కేంద్రాలలో వివక్షతకు తావు లేకుండా మానవతా దృక్పథంతో సేవలందించి మానిటరింగ్ టూల్స్ లో అభివృద్ధి సాధించాలన్నారు




జిల్లా వ్యాప్తంగా తరచుగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తూ నియంత్రణ చర్యలను చేపట్టి వ్యాధి తీవ్రత ప్రమాదకరంగా మారకుండా అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అన్ని సేవలలో మెరుగైన పురోగతిని జాబ్ చార్ట్ కు అనుగుణంగా చేపట్టి వివ క్షతకు తావు లేకుండా మా నవతా కోణంలో వ్యవహరి స్తూ వ్యాధుల బారి నుండి బాధిత వర్గాలకు సంపూర్ణ రక్షణ కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. అందుబా టులో ఉన్న సౌకర్యాలతో మెరుగైన సేవలు అందిస్తూ వ్యాధి నియంత్రణ చర్యలు పటిష్టంగావించాలన్నారు. డిఆర్వో రాజకుమారి మాట్లాడుతూ ఏ ఆర్ టి కేంద్రాలలో జీవితకాలం మందులను ఉచితంగా అందిస్తారని మందులు క్రమం తప్పకుండా వాడించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వ్యాయామం క్రీడల ద్వారా ఆరోగ్యమైన జీవనాన్ని పొందే విధానంపై అవగాహన పెంపొందించాలన్నారు.ప్రతి ఐసీటీసీ కేంద్రాలలో హెచ్ఐవి పరీక్షతోపాటు తగిన సూచనలు సలహాలు ఉచిత సేవలకు సంబంధించిన సమాచారాన్ని బాధిత రోగులకు అందించాలన్నారు. వివిధ రకాలుగా సోకే వ్యాధి సంక్రమణాన్ని పూర్తిగా నివారించాలన్నారు.అదనపు ప్రాజెక్టు సంచాలకులు కామేశ్వర ప్రసాద్ జిల్లాకు సంబంధించి వివిధ పారామీటర్ల వారీగా నియంత్రణ చర్యల పురోగతిని సిబ్బంది ద్వారా సమీక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాషా మాట్లాడుతూ యుక్త వయసు నుండే హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ చర్యల పట్ల పూర్తి అవగాహనను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాన్స్ జెండర్స్, రక్త మార్పిడి, ఇంజక్షన్ సూదులు విచ్చలవిడి శృంగారం వంటి వాటి ద్వారా వ్యాధి సంక్రమణకు ఎక్కువ ఆస్కారం ఉందన్నారు.ఈ అంశాలపై పూర్తి అవగాహనను సమాజంలో పెంపొందించాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్వో దుర్గారావు దొర, డి సి హెచ్ ఎస్ కార్తీక్, అదనపు డి ఎం అండ్ హెచ్ ఓ, జిల్లా ఎయిడ్స్ నియం త్రణ అధికారిని సిహెచ్ వి భరత లక్ష్మి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కీచక కరస్పాండెంట్ పై కఠిన చర్యలు తీసుకోవాలీ.పీ.డీ.ఎస్.యు డిమాండ్




**మండపేట, పెన్ పవర్ జూలై 30:**

పీ.డీ.ఎస్.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి సిద్ధూ మాట్లాడుతూ రాయవరం మండలానికి చెందిన మాచవరం గ్రామంలో జరిగిన ఈ ఘటన పట్ల పీ.డీ.ఎస్.యూ విద్యార్థి సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి, పాఠశాలలో చదువుతున్న 15 ఏళ్ల మైనర్ బాలికను మోసం చేసి లైంగికంగా దోచుకొని గర్భవతిని చేయడం పట్ల విద్యార్థి సమాజం ఉగ్ర ఆవేశంతో ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా విద్యార్థులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.మార్గదర్శి స్కూల్ కరస్పాండెంట్ షాజీ జయరాజుని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలనీ డిమాండ్ చేశారు. రాయవరం మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం ఈ ఘటనలో ఉందని పేర్కొన్నారు. విద్యార్థి సంఘ నాయకులు బుదవారం మాచవరం అత్యాచారానికి గురైన మైనర్ బాలిక ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతా రాజారెడ్డి, కె. నవీన్, గుణం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణం బెల్ట్ షాప్ లు పర్మిట్ రూములు తొలగించాలి

### ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్

**అల్లవరం, పెన్ పవర్, జూలై 30:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులను, పర్మిట్ రూములను ఎక్సైజ్ అధికారులు తక్షణం తొలగించాలని, కొమరగిరిపట్నం అక్రమ మద్యం కేసులో అసలు సూత్రధారులను అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. కొమరగిరిపట్నంలో మద్యం మాఫియా అక్రమ మద్యం తయారు చేస్తూ రాష్ట్రంలో పలు ప్రాంతాలకు సరఫరా చేసి దాదాపుగా 10 కోట్ల అక్రమ మద్యం వ్యాపారం చేశారని ఆయన ఆరోపించారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే అక్రమ మద్యం తయారీ షాపులు సాగుతున్నాయని, జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను సైతం అధికారులు లెక్కచేయడం లేదని ఆయన ఆరోపించారు.కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఉన్న బెల్ట్ షాపులను,పర్మిట్ రూములను రద్దు చేయమని ఆర్డర్ ఇచ్చి ఉన్నారు. కానీ ఇప్పటివరకు ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు ఇంతవరకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. సాక్షాత్తు కలెక్టర్ ఆఫీస్ చుట్టుపక్కల లోను, ఎక్సైజ్ ఆఫీస్ చుట్టుపక్కల్లోనూ పర్మిట్ రూములు, బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నప్పటికీ వాటిపై ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదు. బ్రాందీ షాప్ యజమానులు, ఎక్సైజ్ అధికారులు కుమ్మక్కై ఈ బెల్ట్ షాపులు రూమ్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా దీనిపై చర్య తీసుకోకపోతే వైఎస్ఆర్సిపి పార్టీ తరపున జిల్లా వ్యాప్తంగా ప్రత్యక్ష ధర్నాకు దిగుతామని తీవ్రంగా హెచ్చరిస్తున్నాం. గతంలో అల్లవరం మండలం కొమరగిరిపట్నం నుండి దాదాపుగా 10 కోట్ల అక్రమ మద్యం వ్యాపారం నిర్వహిస్తూ పట్టుబడిన వారిని ఇంతవరకు అరెస్ట్ చేయకుండా కింద స్థాయి వారిని తూతూ మంత్రంగా 8 మంది పై కేసులు పెట్టి అసలైన ముద్దాయిలను విడిచిపెట్టారు. తక్షణమే ఈమద్యం కేసులో ఉన్న అసలైన సూత్రధారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాను. అని అన్నారు.



# లలితా ఎంటర్ప్రైజెస్ అధినేతల సేవలు అభినందనీయం



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 30:**

పెద్దాపురం లలితా ఎంటర్ప్రైజెస్ అధినేతలు సేవలు అభినందనీయమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో పెద్దాపురం లలిత ఎంటర్ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేతలు ఆర్థిక సహాయంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి లలితా ఎంటర్ప్రైజెస్ అధినేతలు మట్టే సత్య ప్రసాద్, మట్టె శ్రీనివాస్, లలిత ఎంటర్ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మట్టే ఆదిశంకర్ హాజరై వాటర్ ప్లాంట్ ను కృష్ణవరం ప్రజలకు అంకితం చేశారు. ముందుగా కృష్ణవరం గ్రామానికి చేరుకున్న వారికి కాకినాడ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొదిరెడ్ల సుబ్బారావు అధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి శుద్ధిచేసిన త్రాగునీరు అందించిన లలితా ఎంటర్ప్రైజెస్ అధినేతలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల

### కృష్ణవరంలో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

మీదుగా ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మట్టే శ్రీనివాస్, ఆదిశంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కృష్ణవరం గ్రామంలో త్రాగునీటి కష్టాలు తీర్చడానికి ఆర్వో ప్లాంట్ కావాలని అడగడం జరిగిందని వెంటనే ఏర్పాటు చేసామని అన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ చిన్న గ్రామం అయిన కృష్ణవరంలో ఈరోజు ఆర్వో ప్లాంట్ ప్రజలకు త్రాగునీటి కష్టాలు తీర్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి,వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, గండే కాశీ, ఎంపీడీఓ బావిశెట్టి హరికృష్ణ, భూపాలపట్నం ప్రసాద్, బొల్లం రెడ్డి రామకృష్ణ, పారంశెట్టి మురళీకృష్ణ, పారంశెట్టి రవి, కుంచే తాతాజీ, బొడ్డేటి సుమన్, అధిక సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు మహిళలు పాల్గొన్నారు.



## ఈదరపల్లి నూతన వంతెనను సుందరీకరించాలి

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్




**అమలాపురం పెన్ పవర్ జూలై 30:**

అమలాపురం ముఖద్వారం ఈదరపల్లి వంతెనకు ఇరు వైపులా (ఎగువ దిగువ) పురపాలక సంఘం%ళి%, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సమన్వయం తో వాహనాలు పాదచారులు సులభతరంగా రాక పోకలు సాగించే విధంగా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సుందరీకరించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు.బుధవారం పురపాలక రహదారులు భవనాల శాఖ ఏపీ ఈపీడీ సీఎల్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి ఇటీవల నూతనంగా నిర్మించిన ఈదరపల్లి వంతెన ఎగువ దిగువ సుందరీకరణ పనుల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రోచ్ రోడ్ల నిర్మా ణాన్ని వేగవంతం చేస్తూ వంతెన సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు.వంతెనకు ఇరువైపులా అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని ఏపీ ఈపీ డీసీఎల్ సూపరింటెంట్ ఇంజనీర్ బి. రాజేశ్వరిని ఆదేశించారు. రహదారులు భవనాల శాఖ అధికారులు అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులపై ఫోకస్ పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమం లో రహదారులు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. రాము,స్థానిక పురపాలక సంఘ కమి షనర్ నిర్మల్ కుమార్ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వానపల్లిలో క్షుద్ర పూజల కలకలం: ఆరుగురి అరెస్ట్



**కొత్తపేట, పెన్ పవర్, జూలై30:**

కొత్తపేట మండలం వానపల్లిలోని గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో ఓ ఇంటి ఆవరణలో క్షుద్ర పూజలు నిర్వహించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సుమారు 20 అడుగుల లోతు గొయ్యి తవ్వి, అందులో గుమ్మడికాయ, కొబ్బరికాయ, నిమ్మకాయలు, నవధాన్యాలు వంటి పదార్థాలు నిక్షిప్తం చేసి పూజలు చేసినట్లు గుర్తించారు.సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని, ఈ వ్యవహారంలో ఆరుగురుని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటన స్థానిక ప్రజల్లో భయం, అనుమానాలు రేకెత్తించింది. గ్రామస్తులు ఇలాంటి చర్యలు చట్టవిరుద్ధమని, సత్వర చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

### ఎంఈఓగా పదోన్నతి పొందిన

## హెచ్ఎం రంగారావుకి సన్మానం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 30 :**

ఎంఈఓగా పదోన్నతి పొందిన జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ టివిఎస్ రంగారావుని బుధవారం స్థానిక ఎస్వీఎస్ వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పులి ప్రసాద్, క్యాండిల్ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు జుత్తుక నాగేశ్వరరావు ఘనంగా సన్మానించారు. టీవీఎస్ రంగారావు మాట్లాడుతూ బదిలీ అయిన సిబ్బంది ఇప్పుడు వచ్చిన సిబ్బంది సహాయ సహకారాలతో పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. ఎక్కడ ఉన్న జగ్గంపేట పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివిఎస్ఎన్ మూర్తి, దాడి బాబురావు, వెన్న శ్రీనివాసులు, ఎం కళ్యాణ చక్రవర్తి, కళ్యాణ్ షైడీశ్వర్, నరసింహమూర్తి, ప్రదీప్ కుమార్, డి.పద్మావతి, వి.సూర్యకుమారి, గంగాభవాని, రామకృష్ణ, బషీరుద్దీన్, జి.నాగమణి, వాణి, సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సేఫ్టీ నిల్ ..!

## భారీ వాహనాలకు అనుమతులు ఫుల్



**ఎటపాక ,పెన్ పవర్, జూలై 30:**

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ పరిధిలోని భారీ వాహనాలు టన్నులకొద్దీ అధిక బరువులతో రోడ్లపై వాహన రవాణా జరగడం జగమెరిగిన సత్యం కానీ ఆ వాహనాలకు ఎటువంటి భద్రత చర్యలు పాటించకుండా అనుమతులు ఇవ్వడం పట్ల పలు అనుమానాలకు దారితీస్తోంది, సరిహద్దు రాష్ట్రమైన ఒడిశా మల్కనగిరి నుంచి తెలంగాణ రాష్ట్రమైన ఖమ్మం జిల్లాకు భారీ వాహనాలపై బండరాలను తరలిస్తున్న వాహన అభిమానులు యజమానులు బండరాలకు ఎటువంటి సేఫ్టీ బెల్టులు ఉపయోగించకుండా తరలించడంతో రాళ్లు కిందపడే అవకాశం ఎక్కువగా ఉందని అలా జరిగితే ప్రమాదాన్ని అంచనా వేయలేమని భయభ్రాంతులకు గురవుతున్న ప్రజానీకం,సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం



కాజులూరు, పెన్ పవర్ జూలై 30: శాంతిమూల గ్రామంలోని దేవుని మందిరంలో పాస్టర్ పి. జాషువా ఆధ్వర్యంలో "వర్ధీ దైవ ప్రసన్న మెమోరీల్ నిర్వహించ బడింది. ఈ శిబిరంలో గ్రామస్తులందరికీ ఉచిత కంటి పరీక్షలు, ఉచిత డెంటల్ చెకప్, జనరల్ ఆరోగ్య పరీక్షలు మరియు షుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ



కార్యక్రమంలో దేవాన్ష్ ఐ కేర్ కాజులూరు, శ్రీ డెంటల్ హాస్పిటల్ గొల్లపాలెం (డాక్టర్ మల్లిక నేతృత్వంలో), కృప ఫస్ట్ ఎయిడ్ సెంటర్ %--% గొల్లపాలెం, శ్రీ సూర్య ప్రకాష్ ల్యాబ్‌లు తమ సేవలను అందించారు. జీవముగల సంఘ సభ్యుల సహాయ సహకారాలతో శిబిరం జయప్రదంగా సాగింది. గ్రామ ప్రజలు పెద్దఎత్తున హాజరై వైద్య సేవలు పొందారు. ప్రజల నుండి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు.

## మంచినీటి చెరువులో పడి వ్యక్తి మృతి



జగ్గంపేట, పెన్ పవర్, జూలై 30: ప్రమాదవశాత్తు జగ్గంపేట మంచినీటి చెరువులో పడి బుధవారం వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేటకు చెందిన దేవిడ్ రాజు(44) గత ఆరు సంవత్సరాలుగా జగ్గంపేట పంచాయతీలో స్వీపర్ గా పనిచేస్తున్నాడు. ఈనెల 29వ తేదీ సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వెళ్ళాడు. అయితే బుధవారం మధ్యాహ్నం మంచినీటి చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. సమాచారం అందగానే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. దీనిపై దేవిడ్ రాజు తల్లి ఎల్లే రత్నం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు.

## రిపోర్టర్ నాగ శ్రీనివాస్ కు పలువురు పరామర్శ



అమలాపురం పెన్ పవర్ జూలై 30 : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం, కొండుకుదురు గ్రామపంచాయతీ పరిధిలోని కొండుకుదురు లంక లో పెన్ పవర్ రిపోర్టర్ పెంటా నాగ శ్రీనివాస్ తండ్రి పెంటా నారాయణస్వామి కొండుకుదురు లో స్వగృహం వద్ద ,వారం రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా పెంట నాగ శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులను పలువురు నాయకులు, అభిమానులు ,బంధువులు పరామర్శించే ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ముమ్మిడివరం నగర పంచాయతీ మాజీ వైస్ పర్సన్ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, పల్లవారిపాలెం ఆర్ఎంపీ డాక్టర్ బద్రి సత్యనారాయణ, కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి చెందిన త్సవటపల్లి వీరభద్రరావు, త్సవటపల్లి సత్తిబాబు, త్సవటపల్లి కృష్ణ,త్సవటపల్లి పార్థసారథి, నల్ల చంటి ,వేగి దొరబాబు,బంటుమిల్లికు చెందిన గాలి దేవర ఏడుకొండలు,అయినవిల్లి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వస్కా శ్యామ్ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి అంజిబాబు, కొండుకుదురు చెందిన తొత్తరముడి జగజ్జీవన్ రామ్, పొట్టిలంక కు చెందిన అంబాజీపేట మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సలాది ప్రసాద్, మామిళ్ళపల్లి తాతాజీ, సర్పంచ్ కోనే చంద్రశేఖరం, గోదసి వెంకయ్య నాయుడు, తదితరులు పరామర్శించారు.

### కోటిపల్లి పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు,
## నూతన ఉపాధ్యాయులకు స్వాగతం

కె గంగవరం పెన్ పవర్ జూలై 30:



కె గంగవరం మండలంలోని కోటిపల్లి ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలతో కూడిన వీడ్కోలు, అలాగే నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు స్వాగత సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూతన ప్రధానోపాధ్యాయులు కుమార్ అధ్యక్షత వహించారు. పాఠశాలలో సేవలందించి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు ఎస్. గోపాలకృష్ణ, గణిత ఉపాధ్యాయుడు వంగా అయ్యప్ప, పీడీజీ. నాగమణి దేవి (సైన్స్), హిందీ ఉపాధ్యాయురాలు వి. సుభలక్ష్మి, తెలుగు ఉపాధ్యాయురాలు జీ. ప్రశాంతి, సామాజికశాస్త్ర ఉపాధ్యాయురాలు కె. విజయదుర్గలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు సుమారు రూ.4000 విలువైన కుర్చీలను బహూకరించగా,ప్రధానోపాధ్యాయులు మరియు సిబ్బంది వారి ఔదార్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో నూతన ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొని, వీడ్కోలు తీసుకున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమం సౌహార్దపూర్వకంగా సాగింది.

# సోలార్ ప్లాంట్ రూఫ్ టాప్ లు ఉపయోగకరం

### రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



అమలాపురం పెన్ పవర్ జూలై 30 : రాజోలు నియోజకవర్గ శాసన సభ్యులు దేవ వరప్రసాద్ ఆగస్టు 15వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పీ 4(పబ్లిక్ ప్రైవేటు పీపుల్స్ పార్టనర్స్ షిప్) కార్యక్రమము, ప్రధాన మంత్రి సూర్య ఘర్ ప్రోగ్రాం గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ అంశములపై సఖినేటిపల్లి, మల్కిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల పంచాయతీ కార్యదర్శులతో అవగాహనా సదస్సు సమీక్షా సమావేశము నిర్వహించారు. ముందుగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకంలో ఎస్.సి.,ఎస్.టి. లబ్ధి దారుల గుర్తింపు , పీ4 పథకం లో బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల గుర్తింపు, శానిటేషన్ కార్యక్రమములపై సంబంధిత అధికారులు సమావేశములో వివరించిన అనంతరం ఈ కార్యక్రమాలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శుల నుండి అభిప్రాయాలను శాసన సభ్యుల వారు అడిగి తెలుసుకున్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ ప్రోగ్రాం లో ఎస్.సి., ఎస్.టి. వారిని గుర్తించు విషయము గురించి మాట్లాడుతూ ప్రభుత్వం వారు ఉచితంగా ఏర్పాటు చేసే రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ లు ఎంతో ఉపయోగకరమైనవని భవిష్యత్తులో వీటిద్వారానే విద్యుత్ అవసరాలు తీర్చుకోవలసిన పరిస్థితులు వస్తాయని, రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ల గురించి ఎస్.సి. ఎస్.టి.,గృహ యజమానులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వారి ఇంటిపై ఏర్పాటు చేసే ఈ ప్లాంటు వల్ల నెలకు రూ.200/- అద్దె రూపంలో ఆదాయం వస్తుందని, 200 యూనిట్ల వరకూ గృహ యజమాని ఉచితంగా విద్యుత్ వాడుకొనే వెసులుబాటు ఉంటుందని రాజోలు నియోజకవర్గం ఎస్.సి.నియోజకవర్గం అయినందున సుమారు 20 వేల ఎస్.సి., కుటుంబాలు వారు ఉన్నారు. కావున వారికి పూర్తి అవగాహన కల్పించి మొదటి ఫేజ్ లోనే ఈ పథకం ద్వారా ఎక్కువ యూనిట్లు నెలకొల్పేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

పీ 4 కార్యక్రమము ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్ది వారికి చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ఆగష్టు 15 నుండి అమలు చేయడానికి సంకల్పించారని, కావున సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించాలని,సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో యున్న వారిని, పారిశ్రామిక వేత్తలను, బాగా చదువుకున్న వారిని, విదేశాలలో స్థిర పడి గ్రామానికి ఎంతో కొంత సేవ చేద్దాము అనే దృక్పథం ఉన్న వారిని వారి అంగీకారంతో మార్గ దర్శకులుగా ఫైనాన్షియల్ ,నాన్ ఫైనాన్షియల్ ఎంపిక చేయాలని, మార్గదర్శకులుగా ఇప్పటికే గుర్తించిన వారిని కలసి వారితో వ్యక్తిగతం గా మాట్లాడి %అ%4 ప్రోగ్రాం గురించి వివరించి ఎంపిక చేయాలని కోరారు. ఈ సందర్భంగా తను ఐ.ఎ.ఎస్. కి ప్రిపేర్ అయిన సందర్భంలో సోషియాలజీ సబ్జెక్ట్ లో తీసుకున్న మార్గదర్శకుల గురించి ప్రస్తావించారు. పారిశుధ్యం గురించి మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యంకు పెద్దపీట వెయ్యాలని,ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. డంపింగ్ యార్డ్ కోసం ప్రతి గ్రామ పంచాయతిలో స్థల సేకరణ చెయ్యాలని పూర్తయితే ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేసి వినియోగం లోకి తేవడం జరుగుతుందని అన్నారు.రోడ్లకిరువైపులా ఎప్పటికప్పుడు బ్లేడ్ ల సహాయంతో క్లీన్ చేయాలని, జంగిల్ క్లియరెన్స్ చేయాలని అవసరమైతే అడ్డుగా ఉన్న అనవసరమైన చెట్లు తొలగించడానికి పంచాయతీలు తీర్మానాలు చేసుకోవాలని అన్నారు. క్లీన్ గ్రామాలుగా తీర్చి దిద్దాలనే ఉద్దేశంతోనే ప్రతీనెలా 3వ శనివారం ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని, చెత్త సేకరణకు అవసరమైతే పెద్ద పంచాయతీలు ట్రాక్టరులు, చిన్న పంచాయతీలు పికప్ వన్స్ కొనుగోలు చేసుకోవాలని సూచించారు. అందరు పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యం పట్ల నిబద్ధతతో పనిచేసి నందు వల్ల ఈ సంవత్సరం జరిగిన అంతర్వేది ఉత్సవాలు సమర్థవంతంగా నిర్వహించ గలిగామని అన్నారు.ఉద్యోగి ఎపుడూ అలర్ట్ ఉండాలని అపుడే విధులు సక్రమంగా నిర్వహించ గలరని అన్నారు.గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు లీడ్ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి, మండల ప్రత్యేకాధికారి,పి.బొజ్జి రాజు, డి.ఇ.ఇ. ఎలక్ట్రికల్ ( ఆపరేషన్) శ్రీ బి.వి.కృష్ణ రాజా, సఖినేటిపల్లి, మలికిపురం,రాజోలు, మామిడికుదురు మండలాల ఎం.పి.డి.ఓ.లు, తహశీల్దార్లు, డిప్యూటీ ఎం.పి.డి.ఓ.,లు, ఎలక్ట్రికల్ ఎ.ఇ.,లు, మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు( పెదకాపు),రాజోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ప్రెసిడెంట్ పినిశెట్టి వెంకటస్వామి (బుజ్జి), చాగంటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి భవనాలకు పొంచి ఉన్న ప్రమాదం..

### స్లాబ్ పై పెచ్చులు ఊడిపోతున్న అంగన్వాడి భవనం




ఎటపాక, పెన్ పవర్, జూలై 30: ఎటపాక మండల పరిధిలోని గొంది రాజుపేట గ్రామ అంగన్వాడి భవనం, మరుగుదొడ్లు ప్రమాదభరితంగా మారాయని స్లాబ్ పై పెచ్చులు ఊడి పోతున్నాయని, మరుగుదొడ్లు పూర్తిగా పాడైపోయాయని, కరెంటు అంతరాయం ఏర్పడిందని, ఇన్ని సమస్యలు ఉన్న అంగన్వాడి కేంద్రంపై అధికారులు కనికరం చూపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అంగన్వాడి భవనానికి మరమ్మత్తులు చేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడతాం

### పశుసంవర్ధకశాఖ ఏడీఏ డా.ఎల్.అనిత



అలమూరు, పెన్ పవర్, జూలై 30: పెదపళ్ళలో వీధి కుక్కలు గేదె దూడలపై దాడి చేసిన ఘటనపై పశుసంవర్ధక శాఖ అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. పశు వైద్యులు డా. భానుప్రకాశ్ గేదె దూడలను పరిశీలించి తగిన వైద్య సహాయం అందించారు. పశుసంవర్ధక శాఖ ఏడీఏ డా.ఎల్.అనిత పెదపళ్ల పంచాయతీ కార్యాలయంలో ఈ అంశంపై మాట్లాడుతూ త్వరలో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించేలా అమలాపురంలో మరో పదిహేను రోజుల్లో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి రానుందని తెలిపారు.

## అపరాల సాగుతో అధిక ఆదాయం

### -పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏఓ సుధామాధురి




కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 30: చేల గట్లపై కంది విత్తనాలు వేసుకోవడం వలన రైతులు అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి అన్నారు. బుధవారం కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుధా మాధురి మాట్లాడుతూ ప్రస్తుతం నాట్లు వేస్తున్నందున నాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. నాట్లు వేసేటప్పుడు ప్రతి రైతు మొనలు తుంచి నాటుకోవాలన్నారు.రైతులకు ఈ కార్యక్రమంలో గట్ల మీద వేసుకోవడానికి కంది విత్తనాలు పంపిణీ చేసారు. కౌలు కార్డులు ఆవశ్యకత, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న సి జి జి బ్యాంకు సందర్శించి కౌలు రైతులకు రుణాలు, ఇన్సూరెన్స్ ఎన్రోల్మెంట్ గురించి బ్యాంకు అధికారిని సంప్రదించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఆకుల సురేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు మాధురిలత పలువురు రైతులు పాల్గొన్నారు.



### మసకపల్లి పంచాయతీ స్వీపర్ కొండయ్య కుటుంబానికి
## సర్పంచ్ ఆర్థిక సహాయం



కె గంగవరం పెన్ పవర్ జూలై 30: కె గంగవరం మండలంలోని మసకపల్లి పంచాయతీలో గత 30 సంవత్సరాలుగా స్వీపర్‌గా విధులు నిర్వహించిన తాతపూడి కొండయ్య ఇటీవల అనారోగ్య కారణంగా మరణించటం పట్ల గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.ఆయన సేవలను స్మరించుకుంటూ, ఆయన కుటుంబానికి మద్దతుగా గ్రామ సర్పంచ్ పిల్లి అన్నపూర్ణ కళ్యాణ్ పరామర్శించడంతో పాటు, కార్యక్రమ ఖర్చుల కోసం రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు.తాతపూడి కొండయ్య పంచాయతీకి అంకితభావంతో పని చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందిన వారు. ఆయన అకాలమరణం పట్ల పలువురు గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

### అమలాపురం ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసిన
## బీసీ ఓబీసీ ఉద్యోగుల సంఘం



అమలాపురం, పెన్ పవర్ జూలై 30: స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుని రాష్ట్ర బీసీ ఓబీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి. వీరబ్రహ్మం మర్యాదపూర్వక కలిసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుమహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి,అమలాపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, జి.వీరబ్రహ్మం (రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ), చొల్లంగి శ్రీధర్ (ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు ), చోడే శ్రీనివాస్ (కాకినాడ టౌన్ అధ్యక్షులు ), కె. నాగరాజు (స్టేట్ కౌన్సిలర్ ) గిసాల శ్రీనివాసరావు, ముమ్మిడివరం డి ఈ శ్రీనివాస్, కాకినాడ టౌన్ అసిస్టెంట్ ఇంజనీర్ వాసంశెట్టి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, పెన్ పవర్, జూలై 30: జగ్గంపేట, కాట్రావులపల్లి 11కేవీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని ఈఈ వీరభద్రరావు, ఏఈ మాధురి తెలిపారు. కావున సీతానగరం, కాట్రావులపల్లి గ్రామాలకు, మరియు బోరులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్ వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# పాక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష



హైదరాబాద్: పోక్సో కేసులో నాంపల్లి కోర్టు కీలక తీర్పునిచ్చింది. 2022లో జరిగిన మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసును విచారించిన నాంపల్లి కోర్టు నిందితుడికి 20యేళ్ల జైలు శిక్ష విధించింది. బుధవారం (జూలై30) హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన లైంగిక వేధింపుల ఘటనలో పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఆఫెన్సెస్) యాక్ట్ కింద కేసు నమోదు చేసిన అంబర్‌పేట్ పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నాంపల్లి కోర్టులోని 12వ అడిషనల్ సెషన్స్ జడ్జి తీర్పు వెలువరిస్తూ..నిందితుడు సలిమెడ వంశీకి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. అదనంగా బాధిత బాలికకు 2 లక్షల రూపాయల పరిహారం అందించాలని కోర్టు ఆదేశించింది.

# నాగార్జున సాగర్‌కు జలకళ.. పోటెత్తిన భారీ వరద..26గేట్లు ఎత్తివేత



నల్లగొండ: నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వదర పోటెత్తింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు డ్యాంలోకి భారీగా వరద నీరు వచ్చిచేరుతోంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సాగర్ అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.బుధవారం (జూలై30) సాయంత్రానికి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 2లక్షల 82వేల 364 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 586 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 300.3200.టీఎంసీలుగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టుమొత్తం 26 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో 16 గేట్లు 5ఫీట్ల మేర, 10 గేట్లు 10ఫీట్ల మేర ఎత్తి 2లక్షల 65వేల 08 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు అధికారు. ఇక ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్తు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# జగన్ లో ఇంత అనూహ్య మార్పు వెనక మ్యాటర్ ఏంటి... ?



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలకు తామే అండగా ఉన్నామని తామే కేరాఫ్ గా నిలిచామని పదే పదే చెప్పుకున్న వైసిపి అధినేత జగన్ తాజాగా ఈ విషయాన్ని పక్కన పెట్టారని తెలుస్తోంది. సాధారణంగా గత ఐదు సంవత్సరాల పరిపాలనను పరిగణలోకి తీసుకుంటే జగన్ ఎక్కడ ఎప్పుడు మాట్లాడినా.. ఏ సందర్భం వచ్చినా 'నా.. ఎస్సీ నా ఎస్టి నా మైనారిటీ' అంటూ ప్రసంగాలు దంచి కొట్టిన విషయం తెలిసిందే. ఒక ప్రసంగాల్లోనే కాదు పనులు కూడా అలాగే చేశారు. అయితే అనూహ్యంగా గత ఎన్నికల్లో వచ్చిన వ్యతిరేక ఫలితంతో పాటు ఎస్సీ ఎస్టీ నియోజకవర్గంలోనూ ఆశించిన విధంగా వైసీపీ పుంజుకోలేకపోయింది.

దీనిపై జగన్ ఇంకా అంతర్మథనం చెందుతూనే ఉన్నారు. మనం ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలకు ఎన్నో మేలు చేశామని అయినా గత ఎన్నికల్లో వారు ఆదరించలేదనేది జగన్ మరోసారి చెప్పుకొచ్చారు. పార్టీ పీఏసీ సమావేశంలో ప్రభుత్వంపై నిప్పులు జరుగుతూనే పోలీసులను విమర్శిస్తూనే అంతర్గతంగా గత ఎన్నికల్లో జరిగిన పరిణామాలను జగన్ ప్రస్తావిస్తూ ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలను మాత్రమే మనం నమ్ముకున్నామని తద్వారా కొన్ని వర్గాలు దూరం అయ్యాయని ఇకనుంచి అటువంటి విధానాన్ని పక్కనపెట్టి భవిష్యత్తు అంతా అందరినీ కలుపుకుని పోయేలాగా ముందుకు సాగుదాం అని ఆయన సూచించారు.

ఇది మెరుగైన సూచన. మేలిమి సూచన అనే చెప్పాలి. ఎందుకంటే కొన్ని వర్గాలకే పరిమితం కావడం కొందరిని వెనకేసుకు రావడం అనేది ఏ రాజకీయ పార్టీకి కూడా మంచిది కాదు. అన్ని వర్గాలను సమానంగా చూస్తూ ఒకటి రెండు సామాజిక వర్గాలను కొంతమేరకు హెల్ప్ చేసినా ఇబ్బంది ఉండేది కాదు. కానీ నా ఎస్సీ నా ఎస్టీ నా బీసీ నామైనారిటీ అంటూ జగన్ చేసిన హడావిడి ఫలితంగా అటూ రెడ్లు ఇటు ఇతర సామాజిక వర్గాలు కూడా పార్టీకి, వ్యక్తిగతంగా జగన్‌కు దూరమయ్యాయి. ఇది గత ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపించింది. అందరూ కలిసి వచ్చి ఓట్లు వేస్తేనే ఎవరైనా అధికారంలోకి వస్తారు.

ఈ విషయాన్ని నెమ్మదిగా గ్రహించిన జగన్ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకనుంచి అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని పోయేలాగా, ఎవరిని దూరంపెట్టేలాగా వ్యవహరించకుండా నాయకులు ముందుకు సాగాలని ఆయన చెప్పుకొచ్చారు. వాస్తవానికి నాయకులు అందరిని కలుపుకునే వెళ్తున్నారు. ఇటు వచ్చి అధిష్టానం దగ్గరే తేడా కొట్టింది. ఇప్పుడు ఆ మార్పు దిశగా జగన్ అడుగులు వేసేందుకు సిద్ధమయ్యారు.కాబట్టి భవిష్యత్తులో కోల్పోయిన ఓటు బ్యాంకు తిరిగి వచ్చే అవకాశం ఉంటుందా ఉండదా అనేది ఆయన వ్యవహరించే శైలి తీరును బట్టి మాత్రమే ఆధారపడి ఉంటుంది. ప్రధానంగా కమ్మ కాపు సామాజిక వర్గాల్లో వైసిపి పట్ల ఏర్పడిన వ్యతిరేకతను సాధ్యమైనంత వరకు తగ్గించడం ద్వారా మాత్రమే జగన్ పుంజుకునే అవకాశం ఉంటుంది. లేకపోతే ఇబ్బందికర పరిస్థితులు తప్పవు.

# తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్: ఇకపై ఏ రోజుకారోజు శ్రీవాణి దర్శనం..



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీవాణి దర్శనం టికెట్ల విషయంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏ రోజుకారోజు శ్రీవాణి దర్శన టికెట్లు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది టీటీడీ. ఆగస్టు 1 నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందని ఒక ప్రకటనలో తెలిపింది టీటీడీ. శ్రీవాణి దర్శన టికెట్లు ఆఫ్ లైన్లో తీసుకొని దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి. బుధవారం ( జులై 30 ) తిరుమలలోని గోకులం కాన్ఫరెన్స్ హాల్ లో శ్రీవాణి దర్శనాలపై సమీక్ష నిర్వహించిన వెంకయ్య చౌదరి ఈమేరకు నిర్ణయాన్ని ప్రకటించారు.శ్రీవాణి దర్శనం విషయంలో ప్రస్తుతం విధానం వల్ల సదరు టికెట్ దర్శనం కోసం భక్తులు సుమారు మూడు రోజుల వేచి ఉండాల్సి వస్తోందని.. వారి సౌకర్యం కోసం ఏ రోజుకారోజు టికెట్ జారీ చేసి దర్శనం కల్పించాలని నిర్ణయించింది టీటీడీ. ఆగస్టు 1 నుంచి 15 వరకు ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు తెలిపింది టీటీడీ. తిరుమలలో ఉదయం 10 గంటల నుండి మొదట వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన టికెట్ల జారీ చేయాలని.. టికెట్లను పొందిన శ్రీవాణి భక్తులకు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1 దగ్గర అదే రోజు సాయంత్రం 4 :30 గంటలకు రిపోర్టింగ్ టైం ఇవ్వాలని తెలిపింది టీటీడీ.

రేణిగుంట విమానాశ్రయంలో ఉదయం 7 గంటల నుండి దర్శన టికెట్లు కోటా ఉన్నంతవరకు ఇవ్వాలని.. యథావిధిగా తిరుమలలో ఆఫ్ లైన్ ద్వారా 800 టికెట్లు, రేణిగుంట విమానాశ్రయంలో 200 టికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపింది టీటీడీ. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ ద్వారా అక్టోబర్ 31వ తేది వరకు ఆన్ లైన్ లో శ్రీవాణి టికెట్లను పొందిన భక్తులకు యథావిధిగా ఉదయం 10 గంటలకే దర్శనానికి అనుమతిచనున్నట్లు తెలిపింది టీటీడీ. నవంబర్ 1వ తేది నుండి శ్రీవాణి టికెట్లను ఆఫ్ లైన్, ఆన్ లైన్ టికెట్లు పొందిన భక్తులకు సాయంత్రం 4:30 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1 ద్వారా శ్రీవారి దర్శనానికి అనుమతివ్వనున్నట్లు తెలిపింది. భక్తులు ముందుగా కౌంటర్ల దగ్గరకు చేరుకుని తాము ఇబ్బంది పడకుండా ఉదయం 10 గంటలకు మాత్రమే తిరుమలలోని శ్రీవాణి టికెట్ జారీ కేంద్రానికి చేరుకోవాలని కోరింది టీటీడీ. ఈ నూతన విధానం తో భక్తులు శీఘ్రంగా అనగా వచ్చిన రోజునే దర్శనం చేసుకునే వెసులుబాటుని గ్రహించ గలరు.

# 'మహా అవతార్ నరసింహ' వసూళ్ల గర్జన.. బాక్సాఫీస్ వద్ద తొలి యానిమేషన్ చిత్రంగా రికార్డు!

**హైదరాబాద్ పెన్ పవర్:** 'మహావతార్ నరసింహ' బాక్సాఫీస్ వద్ద గర్జిస్తుం ది. ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా జూలై 25న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. మొదటి రోజు ఇండియాలో రూ. 1.75 కోట్లు వసూలు చేసింది. పాజిటివ్ టాక్ రావడంతో రోజు రోజుకు కలెక్షన్స్ పెరుగుతున్నాయి. ఈ ఐదు రోజుల్లోనే దాదాపు రూ. 30 కోట్ల మేర రాబట్టింది. ఒక్క హిందీ వెర్షన్ నుంచి రూ. 20.65 కోట్లు కొల్లగొట్టేసిందని ట్రేడ్ వెబ్సైట్ సక్నిల్క్ తెలిపింది.. మంగళవారం ( జూలై 29, 2025 ) ఒక్క రోజే రూ. 7.41 కోట్లు ఆర్జించిందంటే ఈ మూవీ క్రేజ్ ఎలా పెరిగిపోతుందో అర్థం చేసుకోవచ్చు.

సలార్ , కేజీఎఫ్ చాప్టర్ 2 చిత్రాలను నిర్మించిన హొంబలే ఫిల్మ్స్ యానిమేటెడ్ యాక్షన్ డ్రామా ' మహావతార్ నరసింహ'తో మరో బ్లాక్ బస్టర్ ను అందించింది. విడుదలైనప్పటి నుంచీ అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతున్న ఈ యానిమేషన్ చిత్రం, విమర్శకుల ప్రశంసలు అందుకుంటుంది. ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ఈ అద్భుతమైన ఆదరణ పట్ల చిత్ర బృందం, ముఖ్యంగా నిర్మాతలు, తమ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.'మహా అవతార్ నరసింహ' కేవలం ఒక యానిమేషన్ చిత్రం కాదు, ఇది ఒక సాంస్కృతిక సంచలనం. 2005 తర్వాత బాక్సాఫీస్ వద్ద ఇంతటి ప్రభంజనం సృష్టించిన తొలి యానిమేషన్ చిత్రంగా నిలిచి, సరికొత్త మైలురాయిని అధిగమించింది. ఈ చిత్రం సాధించిన విజయం పట్ల చిత్ర బృందం ఎంతో భావోద్వేగానికి లోనైంది. కుల, మత, ప్రాంత బేధాలు లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులతో ఈ చిత్రం ఒక లోతైన ఆధ్యాత్మిక, భావోద్వేగ బంధాన్ని ఏర్పరచుకుందని తెలిపారు. హొంబలె ఫిలిమ్స్ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ, "సినిమా విశ్వాసాలకు వేదికైనప్పుడు... #Mahavatar Narsimha ధర్మశక్తితో భారతదేశం అంతటా హృదయాలను ఏకం చేసింది. మీ దగ్గర్లోని సినిమా హాళ్లలో దివ్య దర్శనం చూడండి" అని పంచుకుంది. ఇది కేవలం ఒక సినిమా అనుభవం కాదని, ఒక ఆధ్యాత్మిక అనుభూతి అనీ, భక్తి, పురాణాలు, ధర్మం యొక్క సారాంశాన్ని దాని చిత్రీకరణతో ప్రేక్షకులను ఆకర్షించి, ఒక సాంస్కృతిక ఉద్యమంగా మారిందని పోస్ట్ చేశారు.అశ్విన్ కుమార్ దర్శకత్వంలో, శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ ల నిర్మాణం లో క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై 'మహా అవతార్ నరసింహ' రూపుదిద్దుకుంది. అద్భుతమైన విజువల్స్, గొప్ప సంస్కృతి, ఉన్నతమైన నాణ్యత, లోతైన కథనంతో ఈ చిత్రాని 3D, 2D1లో జూలై 25, 2025న ఐదు భాషలలో విడుదల అయ్యింది. హొంబలె ఫిలిమ్స్ , క్లీమ్ ప్రొడక్షన్స్ రాబోయే దశాబ్ద కాలానికి సంబంధించిన తమ ప్రతిష్టాత్మక యానిమేషన్ ఫ్రాంచైజీ లైనప్‌ను కూడా వెల్లడించింది. మహా అవతార్ పరశురామ్ (2027), మహా అవతార్ రఘునందన్ (2029), మహా అవతార్ ద్వారకాధీష్ (2031), మహా అవతార్ గోకులనంద (2033), మహా అవతార్ కల్కి పార్ట్ 1 (2035), మహా అవతార్ కల్కి పార్ట్ 2 (2037). ఈ యానిమేషన్ ఫ్రాంచైజీ భారతీయ ఆధ్యాత్మికతను, పౌరాణిక కథలను ప్రపంచానికి చాటి చెప్పడంలో కీలక పాత్ర పోషిస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# 16 మంది వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలోకి జంప్ నా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** జంపింగ్ లకు నో అన్ సీజన్. రాజకీయాల్లో ఎపుడైనా అవి జరగవచ్చు. అటూ ఇటూ రాయబేరాలు సరిపోతే గోడ మీద నుంచి దూకేయడమే. ఆ పార్టీ ఈ పార్టీ అని కాదు రాజకీయలో థియరీ ఇదే. నీతీ రీతి కూడా ఇలాగే ఉంటుంది. అందుకే దానికి పాలిటిక్స్ అనడం లేదు. పాలిట్రిక్స్ అంటారు. ఇపుడు చూస్తే జంపింగుల ప్రాక్టీస్ ఎవరికి అవసరం అంటే కష్టాల్లో ఉన్న వైసీపీ మాజీలకే అని అంటున్నారు. కూటమి కట్టి మూడు పార్టీలు ఐక్యంగా బలంగా ఉన్నాయి. విపక్షంలో ఉన్న వైసీపీని గట్టిగానే టార్గెట్ చేస్తున్నాయి.



**వరస కేసులు అరెస్టులూ :**

ఇదిలా ఉంటే వైసీపీ నేతలందరికీ ఇపుడు ఒక్కటే బెంగ పట్టుకుంది. కేసులు అరెస్టులే ఆ భయం. కేసు పెట్టిన వారు సక్రమం అంటారు, పెట్టించుకున్న వారు అక్రమం అంటారు. ఈ గోల ఘోష ఎలా ఉన్నా బాధితులుగా మాత్రం మారి జైలు ఊచలు లెక్కబెట్టాల్సి వస్తోంది. ఇక ఒకసారి జైలుకు వెళ్తే ఒకటి కంటే ఎక్కువ కేసులు వరసగా కలుపుకుని పోతున్నారు. దాంతో ఎపుడు బయటకు బెయిల్ మీద వస్తారో కూడా అంతు చిక్కడం లేదు. దాంతో ఇపుడు వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు మాజీ మంత్రులలో ఈ అరెస్టు భయాలు గట్టిగానే పట్టుకున్నాయని అంటున్నారు.

**కలవరపెడుతున్న రెడ్ బుక్ :**

బయటకు రెడ్ బుక్ రాజ్యాంగం అని ఎంత విమర్శించినా కూటమి ప్రభుత్వాన్ని ఎంతగా నిందించినా అరెస్టులు అలా జరిగిపోతూనే ఉన్నాయి. దాంతో వైసీపీ మాజీలు అంతా రెడ్ బుక్ కేసుల మీదనే ఆందోళన పడుతున్నారు. రెడ్ బుక్ లో తమ పేర్లు ఉన్నాయనో లేక ఉంటాయనో వారు అంతా కలవరం చెందుతున్నారు అని అంటున్నారు. వైసీపీ నేతలలో భయం అంతకంతకు పెరిగిపోతోంది. ఇది అందరికీ స్పష్టంగా కనిపిస్తోంది అని అంటున్నారు.

**జగన్ ఎన్ని చెప్పినా :**

నిజానికి పార్టీ నాయకులలో ధైర్యం నింపడానికి జగన్ ఎంత ప్రయత్నం చేసినా అది అంతగా ఫలించడం లేదు అని అంటున్నారు. మన ప్రభుత్వం వస్తే అందరికీ చుక్కలు చూపిస్తామని లెక్కలు తేలుస్తామని సినిమా చూపిస్తామని జగన్ చెప్పవచ్చు కాక కానీ ఇపుడు కూటమి వారి చేతిలో అధికారం ఉంది. దాంతో వారు కచ్చితంగా ఆ సినిమాను చుక్కలను చూపిస్తున్నారు అని వైసీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగన్ అధికారంలోకి వస్తే అంటున్నారు. కానీ ఈ లోగా నేతలను తీసుకెళ్ళి జైలులో వేస్తే సమాజంలో పరువు దెబ్బతినిపోతుంది కదా అన్నది కూడా వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు మాజీ మంత్రులలో కలవరంగా ఉంది అని అంటున్నారు.

**డౌట్ ఉంటే చాలు జంపే :**

రెడ్ బుక్ లో ఎవరి పేర్లు ఉన్నాయో ఎవరికీ తెలియదు. అయితే గత అయిదేళ్ళ తమ పాలను బేరీజు వేసుకునో లేక తాము ఎక్కడ ఏమి చేశామో రివీల్ చేసుకునో లేక తమ నియోజకవర్గంలో కూటమి నాయకుల దూకుడుని అంచనా కట్టుకునో చాలా మంది వైసీపీ నేతలు కొత్త ఆలోచనలు చేస్తున్నారు అని అంటున్నారు. రెడ్ బుక్ లో పేరు చేర్చేస్తున్నారు అని ఏ మాత్రం డౌట్ వస్తే చాలు వారు అంతా సేఫ్ జోన్ చూసుకోవడానికి సిద్ధపడుతున్నారని అంటున్నారు. ఈ విధంగా ఆలోచిస్తున్న నేతలకు జనసేన కంటే బీజేపీలోకి వెళ్తే సేఫ్ అని కూడా భావన కలుగుతోందిట.

**బీజేపీలోనే భద్రం :**

ఎందుకంటే ఏపీ బీజేపీ వీక్ గా ఉంది. పైగా అందులో చేరితే నాయకత్వం పోరు ఉండదు, ఇక పార్టీ కూడా అక్కున చేర్చుకుని కాషాయం కండువా కప్పేస్తుంది. ఆ మీదట అతి పెద్ద రక్షణ కవచం దొరికినట్లే అని అంటున్నారు. ఎటూ ఏపీలో బీజేపీని బలోపేతం చేయాలన్న ఆలోచన వారిలో ఉంది. దాంతో దీనినే సాకుగా తీసుకుని కమలానికి రాయబారాలు పంపే వైసీపీ మాజీల లిస్ట్ బాగా పెరిగిపోతుందని అంటున్నారు.

**వీరంతా కమల కుటీరంలోకేనా :**

ఏపీ వైసీపీలో ఉన్న పదహారు మంది మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నాయకులు అంతా బీజేపీలోకి జంప్ చేయడానికి రెడీ అయ్యారని వార్తలు గుప్పుమంటున్నాయి. వీరంతా ప్రస్తుతానికి బీజేపీలోనే తాము ఉండడం అన్ని రకాలుగా మేలు అని భావిస్తున్నరుట. బీజేపీ కూటమిలో ఉంది. పైగా కేంద్రంలో బలంగా ఉంది. దాంతో కమలం పువ్వు పట్టుకుంటే చాలు ఎవరూ తమ జోలికి రారు అని బాగానే రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారు అని అంటున్నారు.

**వైసీపీ సంగతి అపుడే :**

వైసీపీ నుంచి బీజేపీలోకి వెళ్ళాలని చూస్తున్న వారు ఆ పార్టీ మీద అభిమానం లేక కాదని అంటున్నారు. తాము రెడ్ బుక్ నుంచి తప్పించుకోవడానికే అంటున్నారు. ఒకవేళ 2029 ఎన్నికల నాటికి ఏపీలో వైసీపీ వచ్చే అవకాశం ఉంటే కనుక మళ్ళీ ఎన్నికల ముందు ఈ వైపునకు రావచ్చు అన్న లెక్కలు కూడా ఉన్నాయట. అవసరం అయితే కులం కార్డు కూడా తీసి అయినా వైసీపీలోకి తిరిగి రావచ్చు. కానీ ప్రస్తుతం మాత్రం ఫ్యాన్ నీడన ఉండడం రాజకీయంగా ఇబ్బందికరం అని భావిస్తున్నారు అని చెబుతున్నారు. మొత్తానికి చూస్తే ఒకేసారి పదహారు మంది వైసీపీ నుంచి పెద్ద తలకాయలు బీజేపీలోకి వెళ్తారు అంటే గుడ్ నంబర్ గానే చూడాలి. బీజేపీకి ఇది అతి పెద్ద రాజకీయ అవకాశంగా చూస్తున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# 42 నెలల నిషేధం తర్వాత జింబాబ్వే స్టార్ క్రికెటర్ రీ ఎంట్రీ



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ కెప్టెన్ బ్రెండన్ టేలర్ పై ఐసీసీ నిషేధం ముగిసింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు మూడున్నర సంవత్సరాల నిషేధం అనుభవించిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేయనున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగే రెండో టెస్ట్ మ్యాచ్‌తో బ్యాన్ తర్వాత క్రికెట్ లోకి రీ ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమైపోయాడు. టేలర్ నిషేధం జూలై 25న ముగిసింది. ఆగస్టు 7 నుండి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న రెండో టెస్టుకు జింబాబ్వే జట్టులో అతనికి చోటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. టేలర్ రెండో టెస్ట్ కు అందుబాటులో ఉంటాడని జింబాబ్వే కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ కన్ఫర్మ్ చేశాడు. "గత ఏడాది కాలంగా టేలర్ ఎంతలా కష్ట పడుతున్నాడో నాకు తెలుసు. కొద్ది రోజుల్లో అతను తిరిగి క్రికెట్ ఆడడం పట్ల నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను". అని ఎర్విన్ తెలిపాడు. 39 ఏళ్ల టేలర్ సెప్టెంబర్ 2021లో అకస్మాత్తుగా రిటైర్ అయిన తర్వాత ఎలాంటి క్రికెట్ ఆడుతూ కనిపించలేదు. టేలర్ 2004 నుంచి 2021 మధ్య జింబాబ్వే తరపున 34 టెస్టులు ఆడాడు. 36.25 యావరేజ్ తో 2320 పరుగులు చేశాడు. వీటిలో 6 సెంచరీలు, 12 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

**అసలేం జరిగిందంటే..?**

2022 లో బ్రెండన్ టేలర్ పై ఐసీసీ బ్యాన్ విధించింది. ఫిక్సింగ్ కు పాల్పడ్డాడని ఒప్పుకున్న టేలర్ కు..ఐసీసీ యాంటీ కరప్షన్ కోడ్ లో ఐసీసీ యాంటీ డోపింగ్ కోడ్ ను ఉల్లంఘించినందుకు అతడి మీద మూడున్నరేళ్ల పాటు నిషేధం వేసింది. 2019లో ఓ భారత వ్యాపారవేత్త, తనను మ్యాచ్ ఫిక్సింగ్ చేయమని బెదిరించాడని, అందుకు అతను 15 వేల అమెరికన్ డాలర్లు ఆఫర్ చేశాడని ట్విటర్ వేదికగా ఆరోపణలు చేయడం అప్పట్లో సంచలనం గా మారింది. 2021 సెప్టెంబర్‌లో ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన టేలర్.. 2019లో ఓ ప్రముఖ భారత వ్యాపారవేత్త ఆహ్వానం మేరకు భారత్‌కు వచ్చానని, ఆ సందర్భంగా ఓ పార్టీలో కొందరు తనకు కొకైన్ ఆఫర్ చేశారన్నాడు. తాను కొకైన్ సేవిస్తుండగా వీడియోలు తీసి బెదిరించడం మొదలుపెట్టారని, ఈ క్రమంలోనే మ్యాచ్ ఫిక్సింగ్ కూడా చేయమన్నారని సంచలన స్టేట్‌మెంట్‌ను విడుదల చేశాడు.

# పాకిస్తాన్‌తో సెమీఫైనల్ మ్యాచ్ రద్దు చేసుకున్న ఇండియా ఛాంపియన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (%ఔజూ%) లీగ్ లో భాగంగా ఇండియా, పాకిస్తాన్ మధ్య జరగాల్సిన సెమీ ఫైనల్ మ్యాచ్ రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా చాలామంది భారత ఆటగాళు పాకిస్థాన్ తో మ్యాచ్ బహిష్కరించాలని కోరుకుంటున్నారని సమాచారం. గ్రూప్ దశలో పాకిస్థాన్ తో ఇండియా ఆడడానికి నిరాకరించడంతో మ్యాచ్ ను రద్దు చేసి ఇరు జట్లకు చెరొక పాయింట్ ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా శిఖర్ ధవన్ సహా పలువురు ఇండియా వెటరన్ ప్లేయర్లు పాకిస్థాన్ తో లీగ్ మ్యాచ్ ఆడేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే.సెమీ ఫైనల్ అయినప్పటికీ తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని భారత మాజీ క్రికెటర్లు తెలిపారట. గురువారం (జూలై 31) బర్మింగ్ హెూమ్ వేదికగా ఇండియా ఛాంపియన్స్, పాకిస్థాన్ ఛాంపియన్స్ జట్ల మధ్య సెమీస్ ఫైనల్ జరగనుంది. అయితే, మ్యాచ్ ముందు రోజు భారత జట్టు స్పాన్సర్‌లలో ఒకరైన ఈజ్‌మైట్రిప్ ఉగ్రవాదం, క్రికెట్ కలిసి ఉండలేవని చెబుతూ సెమీ ఫైనల్ నుంచి వైదొలిగింది. కంపెనీ వ్యవస్థాపకుడు నిశాంత్ పిట్టి మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ టోర్నమెంట్‌లో సెమీ-ఫైనల్‌కు చేరుకున్నందుకు ఇండియా ఛాంపియన్‌లను తాము అభినందిస్తున్నప్పటికీ, పాకిస్తాన్ పాల్గొన్న మ్యాచ్‌లతో సంబంధం కలిగి ఉండటానికి తాము ఇష్టపడటం లేదని అన్నారు.కొన్ని రోజుల క్రితమే టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ పాకిస్థాన్ తో నాకౌట్ మ్యాచ్ అయినా ఆడేది లేదని తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పాడు. రూల్స్ ప్రకారం.. ఇండియా ఛాంపియన్స్ సెమీ-ఫైనల్‌లో పాకిస్తాన్ ఛాంపియన్స్‌తో ఆడటానికి నిరాకరిస్తే మొహమ్మద్ హఫీజ్ కెప్టెన్సీలోని పాకిస్థాన్ ఛాంపియన్స్ జట్టుకు వాకోవర్ లభిస్తుంది. దీంతో పాకిస్తాన్ ఛాంపియన్స్ సెమీస్ ఆడకుండానే ఫైనల్‌కు చేరుకుంటుంది.

ఇండియా ఈ మ్యాచ్ లో ఆడే అవకాశం లేనందున పాకిస్థాన్ ఛాంపియన్స్ సెమీస్ ఆడకుండానే ఫైనల్లో అడుగు పెట్టబోతోంది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్ల మధ్య మరో సెమీస్ జరుగుతుంది.

# మనోడే నెంబర్ 1: టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్న అభిషేక్ శర్మ




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యువ సంచలనం అభిషేక్ శర్మ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో నెంబర్ స్థానంలో నిలిచాడు. బుధవారం (జూలై 30) ఐసీసీ రిలీజ్ చేసిన టీ20 ర్యాంకింగ్స్ లో ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. టీ20 ఫార్మాట్ లో విరాట్ కోహ్లీ, సూర్య కుమార్ యాదవ్ తర్వాత నెంబర్ వన్ స్థానానికి చేరుకున్న మూడో ఇండియన్ గా చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం అభిషేక్ శర్మ ఖాతాలో 829 రేటింగ్ పాయింట్లు ఉండగా.. 814 పాయింట్లతో హెడ్ రెండో స్థానానికి పడిపోయాడు. ఇటీవలే జరిగిన వెస్టిండీస్ తో జరిగిన 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో హెడ్ ఆడకపోవడంతో రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2024 లో జింబాబ్వేపై తన కెరీర్ లో తొలి టీ20 సెంచరీ చేసి సత్తా చాటిన అభిషేక్.. నిలకడతో పాటు వేగంగా రాణిస్తూ భారత జట్టులో చోటు పదిలం చేసుకున్నాడు. 2025 లో ఇంగ్లాండ్ పై జరిగిన ఐదో టీ20లో 37 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. 2024 టీ20 వరల్డ్ కప్ సమయంలో సూర్యను అధిగమించి టాప్ కు చేరుకున్న హెడ్.. ఏడాది తర్వాత టీ 20 ఫార్మాట్ లో తన నెంబర్ వన్ ర్యాంక్ ను అభిషేక్ శర్మకు కోల్పోవాల్సి వచ్చింది. టీమిండియా బ్యాటర్లల్లో తిలక్ వర్మ మూడో స్థానంలో.. కెప్టెన్ సూర్యకుమార్ ఆరో స్థానంలో కొనసాగుతున్నారు. టాప్- 10 లో ఉన్న జైశ్వాల్ రెండు స్థానాలు కోల్పోయి 11 వ స్థానానికి పడిపోయాడు.

ఇంగ్లాండ్ ఓపెనర్లు సాల్ట్, బట్లర్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. బౌలింగ్ విషయానికి వస్తే న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ జాకబ్ డాఫి అగ్ర స్థానంలో ఉన్నాడు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి మూడో స్థానంలో.. అర్షదీప్ సింగ్ పదో స్థానంలో కొనసాగుతున్నారు. టీమ్స్ విషయానికి వస్తే ఇండియా టీ20 ర్యాంకింగ్స్ లో టాప్ లో ఉంది. ఆల్ రౌండర్ విభాగంలో టీమిండియా స్టార్ హార్దిక్ పాండ్య అగ్ర స్థానంలోనే ఉన్నాడు.



మస్టర్డ్ చీరలో నిర్మలమైన రూఫ్‌టాప్ మూమెంట్‌ను పంచుకున్న మహిరా శర్మ

# ఎన్టీఆర్ సినిమాలో త్రివిక్రం ఛాయిస్ ఎవరు..?



మహేష్ తో గుంటూరు కారం తర్వాత త్రివిక్రమ్ కూడా ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఫిక్స్ చేసుకున్నాడు. ముందు హీరోగా అల్లు అర్జున్ అనుకోవడం ఆ తర్వాత ఆయన ప్లేస్ లో ఎన్టీఆర్ రావడం అంతా తెలిసిందే. అసలు అల్లు అర్జున్ బదులుగా ఎన్టీఆర్ ని ఎందుకు రీ ప్లేస్ చేశారా అన్నది మాత్రం తెలియలేదు. ఇదిలా ఉంటే ఈ సినిమా మురుగన్ కుమారస్వామి గురించి ఉంటుందని ఇప్పటికే నిర్మాత నాగ వంశీ హింట్ ఇచ్చాడు. ఆమధ్య ఎన్టీఆర్ మురుగన్ బుక్ తో కనిపించే సరికి ఈ మాటకు ఇంకాస్త బలం వచ్చింది.

**డ్రాగన్ టైటిల్ తో ఎన్టీఆర్..**

వార్ 2 రిలీజ్ బిజీలో ఉన్న ఎన్టీఆర్ ఓ పక్క ప్రశాంత్ నీల్ సినిమాను కూడా పూర్తి చేసే పనుల్లో ఉన్నాడు. ఆ సినిమా ఎక్స్ట్ ఇయర్ సమ్మర్ కి ఎలాగైనా తీసుకు రావాలని గట్టి ప్లానింగ్ తో వెళ్తున్నారు. డ్రాగన్ టైటిల్ తో వస్తున్న ఆ సినిమా గురించి ప్రతి అప్డేట్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ త్రివిక్రమ్ సినిమా ఈ ఇయర్ లోనే సెప్టెంబర్ లేదా అక్టోబర్ లో సెట్స్ మీదకు వెళ్తుందని తెలుస్తుంది.

ఐతే ఎన్టీఆర్ గురూజీ మూవీలో హీరోయిన్ ఎవరన్నది తెలియాల్సి ఉంది. ఆమధ్య ఎన్టీఆర్ చేతిలో ఉన్న పుస్తకమే మలయాళ నటి మడోన్నా సెబాస్టియన్ దగ్గర ఉందని హడావిడి చేశారు. అసలు మడోన్నా ఆ బుక్ ఎందుకు చదువుతుందా అన్న అనుమానాలు వచ్చాయి. మడోన్న గురించి కన్ఫర్మేషన్ అయితే ఏది రాలేదు. మరో హీరోయిన్ ఎవరైనా ఉంటారా అన్న డిస్కషన్స్ కూడా ఏమి జరగట్లేదు.

**ఎన్టీఆర్ మైథాలజీ సినిమా..**

ఎన్టీఆర్ త్రివిక్రం అరవింద సమేత సినిమాకు కలిసి పనిచేశారు. ఎన్టీఆర్ తో ఊర మాస్ సినిమా చేసినా అందులో తన మార్క్ కనిపించేలా చేశాడు గురూజీ. అందుకే త్రివిక్రం డైరెక్షన్ లో ఎన్టీఆర్ సినిమా అది కూడా మైథాలజీ అనేసరికి ఎన్టీఆర్ ఫ్యాన్స్ కి ఈ ప్రాజెక్ట్ మీద ఆసక్తి ఎక్కువైంది. ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తేనే కానీ అసలు విషయాలు అన్ని ఒక్కొక్కటిగా తెలుస్తాయి.

త్రివిక్రం మాత్రం ఈ సినిమాను తన కెరీర్ లో ఏ సినిమాకు చేయనంత గ్రాండ్ గా భారీగా ప్లాన్ చేస్తున్నారని అర్థమవుతుంది. మరి గురూజీ ఇలా కమిటై చేస్తున్న ఈ ప్రాజెక్ట్ ఏ రేంజ్ లో ఉంటుంది.. ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుంది అన్నది చూడాలి.



చంద్రిక రవికి నో స్టాపింగ్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com